గురువారం
THURSSDAY
8-10-2026
సంపుటి ( Volume):2 ॥ సంచిక: (Issue): 100
జగిత్యాల JAGITIAL ॥ పేజీలు: (PAGES):12 వెల (PRICE): 2.00
Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

అరచేతిలో ఈవార్తలు దినపత్రిక
స్కాన్ చేయండి..
ఆండ్రాయిడ్ యాప్
డౌన్‌లోడ్ చేసుకోండి..
GET IT ON Google Play

# వాళ్లకు పండుగ!

## ఉద్యోగులకు రెండు డీఏలు విడుదల

### తెలంగాణ ప్రభుత్వం దసరా కానుక

### మొత్తం 6.37 శాతం పెరగనున్న కరువు భత్యం

### అక్టోబర్ జీతంతో కలిపి పెరిగిన డీఏ చెల్లింపు

### ప్రభుత్వంపై ఏటా రూ. 2,500 కోట్ల అదనపు భారం

దసరా పండుగ ముందు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న రెండు విడతల కరవు భత్యాన్ని (డీఏ) మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 1వ తేదీన జరిగిన మంత్రిమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులను వెలువరించింది.




హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, 2024 జనవరి 1 నుంచి డీఏ 33.67 శాతం నుంచి 37.31 శాతానికి, 2024 జులై 1 నుంచి 40.04 శాతానికి పెరగనుంది. దీంతో ఉద్యోగుల డీఏ మొత్తం 6.37 శాతం పెరిగినట్లయింది. పెరిగిన డీఏను అక్టోబరు నెల వేతనంతో కలిపి చెల్లించనున్నారు. అంటే నవంబరు 1వ తేదీన ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాల్లో జమ కానుంది. 2024 జనవరి నుంచి 2026 సెప్టెంబర్ వరకు పేరుకుపోయిన బకాయిలను జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) ఖాతాల్లో జమ చేస్తారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) పరిధిలోకి వచ్చే వారికి ఈ బకాయిలను తరువాయి 2 వ పేజీలో...



# వీళ్లకు పస్తులు!

## జీతం రాక.. దసరా పండుగ చేసుకొనేదెలా?

### నాలుగు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు

### సాంఘిక సంక్షేమ గురుకుల పార్ట్‌టైం టీచర్ల ఆవేదన

### జూన్‌లో విధుల్లో చేరిన 574 మందికి ఇప్పటికీ అందని జీతాలు

### ఐఎఫ్ఎంఎస్ నమోదులో జాప్యమే కారణం?

### అధికారుల తీరుపై బాధిత టీచర్ల మండిపాటు

దసరా పండుగ వస్తోంది.. ప్రతి ఇంటా పండుగ సందడి మొదలు కాబోతోంది.. పిల్లలకు కొత్త బట్టలు, ఇంట్లో పండుగ సరుకులు, కుటుంబంతో ఆనందంగా గడపాలన్న ఆశలు కనిపిస్తున్నాయి. కానీ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న వందల మంది పార్ట్‌టైం ఉపాధ్యాయుల ఇండ్లలో మాత్రం ఆ సందడి కనిపించడం లేదు. కారణం.. నాలుగు నెలలుగా జీతం అందకపోవడమే.

హనుమకొండ, అక్టోబర్ 7 (ఈవార్తలు): విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు వారి బాగోగులు చూసుకుంటూ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని పార్ట్‌టైం ఉపాధ్యాయులు తమ కుటుంబాలను పోషించుకోవడానికి మాత్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండుగ సమీపిస్తున్నా చేతిలో జీతం లేకపోవడంతో కనీస అవసరాలు తీర్చుకోవడానికే అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. 2026 జూన్‌లో డెమో ద్వారా ఎంపికై సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విధుల్లో చేరిన 574 మంది పార్ట్‌టైం ఉపాధ్యాయులకు ఇప్పటివరకు -2 వ పేజీలో...

# రెపో 'పోటు'!

## రుణగ్రహీతలపై వడ్డీ భారం.. 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్బీఐ



### 5.50 శాతానికి చేరిన రెపో రేటు.. ద్రవ్యోల్బణ కట్టడే లక్ష్యం

### చర వడ్డీ రుణాలపై ఈఎంఐల పెంపు ప్రభావం

### విధాన వైఖరి 'క్రమబద్ధ కఠినతరం' వైపు

### భవిష్యత్‌లో మరిన్ని పెంపులకు సంకేతాలు

దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను అదుపులోకి తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ పరిణామాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ అక్టోబర్ 5 నుంచి 7 వరకు నిర్వహించిన సమావేశంలో విధాన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.25 శాతం నుంచి 5.50 శాతానికి చేరింది. ఈ నిర్ణయాన్ని కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ముంబై: దాదాపు మూడున్నరేళ్ల తర్వాత రెపో రేటులో పెంపు చోటుచేసుకోవడం గమనార్హం. అదే సమయంలో ఆర్బీఐ తన విధాన వైఖరిని 'తటస్థం' నుంచి 'క్రమబద్ధ కఠినతరం' వైపు మార్చింది. అంటే ఇకపై వడ్డీ రేట్లను తగ్గించే దిశలో కాకుండా, ద్రవ్యోల్బణ పరిస్థితులను బట్టి రేట్లను స్థిరంగా ఉంచడం లేదా అవసరమైతే మరింత పెంచే అవకాశాన్ని ఆర్బీఐ తెరిచి ఉంచినట్టుగా భావిస్తున్నారు. అంతర్జాతీయ తరువాయి 2 వ పేజీలో...

# 2047.. చేసి చూపిద్దాం!

## 'వికసిత్ భారత్' నా స్వప్నం

### టాప్ 3 ఆర్థిక వ్యవస్థల్లో భారత్ .. ప్రజలు సాక్షాత్తు దైవస్వరూపులు

### అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.. 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ'లో ప్రధాని మోదీ



'మనం అనుకున్నది చేసి చూపిద్దాం(వుయ్ విల్ డూ ఇట్)' అనే కొత్త నినాదాన్ని ప్రధానమంత్రి వినిపించారు. ప్రజలందరి ఉమ్మడి కృషితో 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని కచ్చితంగా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాతికేళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొని బుధవారం ఢిల్లీలో 'వికసిత్ భారత్ సంకల్ప్ సభ' నిర్వహించారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు, మోదీ అభిమానులు భారీగా తరలివచ్చారు. మోదీ మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావించారు. ఒకప్పుడు అసాధ్యంగా భావించినవి నేడు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

న్యూఢిల్లీ: 2026లో మనం కంటున్న 'అభివృద్ధి చెందిన భారత్'అనే కల కచ్చితంగా సాకారం అవుతుందని, దేశం ఇప్పుడు ఇక్కడే ఆగిపోవడానికి ఎటువంటి కారణం లేదని ఉద్ఘాటించారు. వందేళ్ల క్రితం మన జనాభా 40 కోట్ల కంటే తక్కువగా ఉండేదని, నేడు 140 కోట్లకు చేరిందని అన్నారు. 140 కోట్ల మంది పౌరులు కలిసి 2047 నాటికి 'వికసిత్ భారత్'ను నిర్మిస్తారని పునరుద్ఘాటించారు. "ఎన్నికల సమయంలో కులపరమైన విభజనలు ఒక ప్రధాన సవాలుగా మారుతున్నాయి. ఓటు బ్యాంకు ప్రయోజనాల కోసం రాజకీయంగా విడిపోవడం దేశం ఎదుర్కొంటున్న అత్యంత క్లిష్టమైన సవాళ్లలో ఒకటి. ఏదైనా ఆపద వచ్చినప్పుడు అది వర్గం లేదా కులానికి అతీతంగా అందరిపైనా ప్రభావం చూపుతుందని గుర్తుంచుకోవాలి. రైతు పొలంలో నీటి కొరత ఏర్పడినప్పుడు, ఆ సమస్య కేవలం ఒక కులానికే పరిమితమవుతుందా? విద్యుత్ లేనప్పుడు చీకటి కేవలం ఒక వర్గానికే అలుముకుంటుందా? సమస్య అందరికీ సంబంధించినదైనప్పుడు పరిష్కారం కూడా అందరికీ వర్తించేలా ఉండాలి. కేవలం తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,957 |
| వెండి (కిలో): | రూ.2,45,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,238 |

## విశ్వవాణి



రాబోయే రోజుల్లో మధుమేహం మరింత దారుణంగా విస్తరిస్తుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022 నాటికి 80 కోట్లకు పైగా పెద్దలు మధుమేహంతో బాధపడ్డారు. 1990తో పోలిస్తే ఇది నాలుగు రెట్లకుపైగా పెరిగింది. పెద్దల్లో మధుమేహం వ్యాప్తి కూడా 7 శాతం నుంచి 14 శాతానికి రెట్టింపైంది. ఈ పెరుగుదలలో ప్రధానంగా టైప్-2 మధుమేహందే కీలక పాత్ర. ప్రస్తుతం ఆ సంఖ్య అనుకున్నదానికంటే వేగంగా పెరుగుతోందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.



# దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు

### 30 మంది ఉంటే ఇంటికే వచ్చి పికప్: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): దసరా వేళ అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికులు తమ స్వగ్రామాలకు సురక్షితంగా, సౌకర్యవంతంగా చేరుకునేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) భారీ ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు బుధవారం ప్రకటించింది. సంస్థ వెల్లడించిన తరువాయి 2 వ పేజీలో...

# అణువుల గుట్టు ఛేదించారు.. నోబెల్ బహుమతి పట్టేశారు!

### కెమిస్ట్రీలో హెన్రీ కగన్, కెన్సో సోయ్‌లకు ప్రకటన

రసాయన శాస్త్రంలో, అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 2026 నోబెల్ బహుమతిని ఇద్దరు శాస్త్రవేత్తలు సంయుక్తంగా గెలుచుకున్నారు. ఫ్రాన్స్‌లోని పారిస్-సడ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెన్రీ బి. కగన్, జపాన్‌లోని టోక్యో యూనివర్సిటీ ఆఫ్ సైన్స్‌కు చెందిన కెన్సో సోయ్‌లకు ఈ గౌరవం దక్కింది. అసమాన సేంద్రియ సంశ్లేషణలో నాన్-లీనియర్ ఎఫెక్ట్స్, స్వీయ ఉత్ప్రేరణ వంటి కీలక ప్రక్రియలను ఆవిష్కరించినందుకు గాను వారిని ఈ పురస్కారం వరించినట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది.




స్టాక్ హోం: ప్రకృతిలో అనేక అణువులు, ముఖ్యంగా మన శరీరంలోని అమైనో ఆమ్లాల వంటివి రెండు ప్రతిబింబ రూపాల్లో ఉంటాయి. అయితే, జీవరాశులు కేవలం ఒకే రూపాన్ని వినియోగించుకుంటాయి. ఈ రసాయన అసమానత లేదా 'హోమోకిరాలిటీ' ఎలా సాధ్యమవుతుందనేది శాస్త్రవేత్తలకు శతాబ్దాలుగా ఓ పెద్ద మిస్టరీ. ఈ రహస్యాన్ని ఛేదించడంలో కగన్, సోయ్ చేసిన పరిశోధనలు కీలకపాత్ర పోషించాయి. ఒక రసాయన చర్యలో ఊహించిన దానికంటే ఎక్కువ స్థాయిలో ఒకే ప్రతిబింబ రూపాన్ని ఉత్పత్తి చేయవచ్చని హెన్రీ కగన్ తన పరిశోధనల ద్వారా నిరూపించారు. మరోవైపు కెన్సో సోయ్తరువాయి 2 వ పేజీలో...




# షెడ్యూల్ బ్యాంకుల నుంచి పేటీఎం తొలగింపు

### ఆర్బీఐ కీలక నిర్ణయం.. నోటిఫికేషన్ జారీ

### నిబంధనల ఉల్లంఘన కారణంగానే ఈ కఠిన చర్యలు

### బ్యాంకును మూసివేయాలని గతంలోనే ఢిల్లీ హైకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం అనుబంధ సంస్థ 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్' (పీపీబీఎల్)ను షెడ్యూల్డ్ బ్యాంకుల జాబితా నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తొలగించింది. ఈ ఏడాది ప్రారంభంలోనే పీపీబీఎల్ బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసిన నేపథ్యంలో, తాజా నిర్ణయం దాని నియంత్రణ హోదా మార్పును అధికారికంగా ధ్రువీకరించింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం-1934లోని రెండోతరువాయి 2 వ పేజీలో...

# మహిళలకు రూ.2,500.. అంతా తూచ్!

### ఆ ప్రచారంలో నిజం లేదన్న తెలంగాణ ప్రభుత్వం

### సీఎం రేవంత్ పేరుతో ఏఐ టూల్స్‌తో డీప్‌ఫేక్ వీడియో సృష్టి

### సోషల్ మీడియా వదంతులను నమ్మవద్దని ప్రభుత్వ సూచన

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయంతో పాటు, కల్యాణలక్ష్మి పథకం కింద రెండు తులాల బంగారం ఇస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ఇదంతా పూర్తిగా అసత్య ప్రచారమని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని బుధవారం స్పష్టం చేసింది. బతుకమ్మ పండుగ నుంచి ఈ పథకం -2 వ పేజీలో...





# చిన్నారులకు ఒబెసిటీ మాత్రలు వద్దు

### పదేళ్లలోపు వాళ్లకు ఎట్టిపరిస్థితుల్లో వాడొద్దు

### మెడిసిన్స్ ఫలితాలపై స్పష్టమైన ఆధారాల్లేవ్

### ప్రపంచ ఆరోగ్య సంస్థ కీలక ప్రకటన

జెనీవా: ఒబెసిటీ మందులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కీలక ప్రకటన చేసింది. పదేళ్ల లోపు చిన్నారులకు ఈ మందులు ఎట్టిపరిస్థితుల్లో వాడవద్దని తెలిపింది. ఒబెసిటీ మెడిసిన్స్ ఫలితాలపై ఇప్పటి వరకూ స్పష్టమైన ఆధారాలు తరువాయి 2 వ పేజీలో...



# కేసీఆర్ దంపతుల ప్రత్యేక హోమం

సిద్దిపేట, అక్టోబర్ 7 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో సతీమణి శోభతో కలిసి ప్రత్యేక హోమం నిర్వహించారు. దంపతులిద్దరు కలిసి హోమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌కు సంబంధించిన భూముల వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఈ హోమం చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఎర్రవల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాలు ఉండాల్సి ఉండగా, ఇటీవల నిర్వహించిన సర్వేలో 343 ఎకరాలు మాత్రమే గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో 45 ఎకరాల వ్యత్యాసంపై మరింత విచారణకు ఆదేశాలు జారీ అయిన విషయం తెలిసిందే.

# రెపో 'పోటు'!

**మొదటి పేజీ తరువాయి**

ముడిచమురు ధరల పెరుగుదల, ఆహార ధరల్లో ఒత్తిళ్లు, బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో పరిస్థితులు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను పెంచుతున్నాయని ఆర్బీఐ పేర్కొంది. ఆగస్టులో వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరగా, జూలైలో ఇది 4.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణ అంచనాను ఆర్బీఐ 5.2 శాతానికి పెంచింది. డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 6 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ఆహారం, ఇంధనం మాత్రమే కాకుండా ధరల ఒత్తిడి ఇతర రంగాలకు కూడా విస్తరిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వృద్ధిపై ఆర్బీఐ ఆశావహంగానే ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి అంచనాను 6.7 శాతం నుంచి 7.1 శాతానికి పెంచింది. సేవల రంగం, పెట్టుబడులు, మౌలిక వసతుల వ్యయం, రుణ ప్రవాహం వంటి అంశాలు వృద్ధికి మద్దతు ఇస్తాయని అంచనా వేసింది. అయితే అధిక ముడిచమురు ధరలు, పశ్చిమాసియా పరిణామాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది.

రుణగ్రహీతలకు పెరగనున్న భారం

రెపో రేటు పెంపు ప్రభావం ప్రధానంగా రెపో రేటు లేదా ఇతర బాహ్య ప్రమాణాలకు అనుసంధానమైన చర వడ్డీ రుణాలపై పడుతుంది. ముఖ్యంగా గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యక్తిగత రుణాల్లో వడ్డీ రేట్లు పెరిగితే నెలవారీ ఈఎంఐ పెరగవచ్చు లేదా అదే ఈఎంఐని కొనసాగిస్తూ రుణ కాలపరిమితిని బ్యాంకు పెంచవచ్చు. అయితే ప్రతి రుణగ్రహీతకు వెంటనే అదనపు భారం పడుతుందని చెప్పడం సరైంది కాదు. రుణ ఒప్పందంలోని వడ్డీ రేటు విధానం, రీసెట్ తేదీ, రుణదాత విధానం ఆధారంగా ప్రభావం మారుతుంది. రుణాలపై వడ్డీ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, బ్యాంకులు డిపాజిట్ రేట్లను కూడా సవరించే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి లేదా అధిక వడ్డీతో పునరుద్ధరించే వారికి కొంత ప్రయోజనం లభించవచ్చు.

అయితే డిపాజిట్ రేట్ల పెంపు ప్రతి బ్యాంకులో ఒకే సమయంలో, ఒకే స్థాయిలో జరగదు.

### ఎవరి ఈఎంఐ పెరిగే అవకాశం?

అధిక ప్రభావం:
- రెపో రేటుకు అనుసంధానమైన గృహ రుణాలు
- బాహ్య ప్రమాణానికి అనుసంధానమైన చర వడ్డీ రుణాలు
- కొన్ని వాహన రుణాలు
- కొన్ని వ్యక్తిగత రుణాలు

**తక్షణ ప్రత్యక్ష ప్రభావం లేనిది/తక్కువ:**
- స్థిర వడ్డీ రుణాలు
- రీసెట్ తేదీ ఇంకా రాని కొన్ని చర వడ్డీ రుణాలురుణగ్రహీతలపై వడ్డీ భారం

25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్బీఐ
5.50 శాతానికి చేరిన రెపో రేటు
ద్రవ్యోల్బణ కట్టడే లక్ష్యం
చర వడ్డీ రుణాలపై ఈఎంఐల పెంపు ప్రభావం
విధాన వైఖరి 'క్రమబద్ధ కఠినతరం' వైపు
భవిష్యత్‌లో మరిన్ని పెంపులకు సంకేతాలు

ముంబై: దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను అదుపులోకి తీసుకురావడంతో పాటు అంతర్జాతీయ పరిణామాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భారతీయ రిజర్వు బ్యాంకు కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ అక్టోబర్ 5 నుంచి 7 వరకు నిర్వహించిన సమావేశంలో విధాన రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.25 శాతం నుంచి 5.50 శాతానికి చేరింది. ఈ నిర్ణయాన్ని కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. దాదాపు మూడున్నరేళ్ల తర్వాత రెపో రేటులో పెంపు చోటుచేసుకోవడం గమనార్హం. అదే సమయంలో ఆర్బీఐ తన విధాన వైఖరిని 'తటస్థం' నుంచి 'క్రమబద్ధ కఠినతరం' వైపు మార్చింది. అంటే ఇకపై వడ్డీ రేట్లను తగ్గించే దిశలో కాకుండా, ద్రవ్యోల్బణ పరిస్థితులను బట్టి రేట్లను స్థిరంగా ఉంచడం లేదా అవసరమైతే మరింత పెంచే అవకాశాన్ని ఆర్బీఐ తెరిచి ఉంచినట్టుగా భావిస్తున్నారు.

ద్రవ్యోల్బణమే ప్రధాన కారణం

అంతర్జాతీయ ముడిచమురు ధరల పెరుగుదల, ఆహార ధరల్లో ఒత్తిళ్లు, బలహీనమైన నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో పరిస్థితులు, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ద్రవ్యోల్బణంపై ఆందోళనలను పెంచుతున్నాయని ఆర్బీఐ పేర్కొంది. ఆగస్టులో వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరగా, జూలైలో ఇది 4.5 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో సగటు ద్రవ్యోల్బణ అంచనాను ఆర్బీఐ 5.2 శాతానికి పెంచింది. డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 6 శాతానికి చేరవచ్చని అంచనా వేసింది. ఆహారం, ఇంధనం మాత్రమే కాకుండా ధరల ఒత్తిడి ఇతర రంగాలకు కూడా విస్తరిస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక వృద్ధిపై ఆర్బీఐ ఆశావహంగానే ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి అంచనాను 6.7 శాతం నుంచి 7.1 శాతానికి పెంచింది. సేవల రంగం, పెట్టుబడులు, మౌలిక వసతుల వ్యయం, రుణ ప్రవాహం వంటి అంశాలు వృద్ధికి మద్దతు ఇస్తాయని అంచనా వేసింది. అయితే అధిక ముడిచమురు ధరలు, పశ్చిమాసియా పరిణామాలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతికూలంగా మారే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది.

రుణగ్రహీతలకు పెరగనున్న భారం

రెపో రేటు పెంపు ప్రభావం ప్రధానంగా రెపో రేటు లేదా ఇతర బాహ్య ప్రమాణాలకు అనుసంధానమైన చర వడ్డీ రుణాలపై పడుతుంది. ముఖ్యంగా గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యక్తిగత రుణాల్లో వడ్డీ రేట్లు పెరిగితే నెలవారీ ఈఎంఐ పెరగవచ్చు లేదా అదే ఈఎంఐని కొనసాగిస్తూ రుణ కాలపరిమితిని బ్యాంకు పెంచవచ్చు. అయితే ప్రతి రుణగ్రహీతకు వెంటనే అదనపు భారం పడుతుందని చెప్పడం సరైంది కాదు. రుణ ఒప్పందంలోని వడ్డీ రేటు విధానం, రీసెట్ తేదీ, రుణదాత విధానం ఆధారంగా ప్రభావం మారుతుంది. రుణాలపై వడ్డీ పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, బ్యాంకులు డిపాజిట్ రేట్లను కూడా సవరించే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి లేదా అధిక వడ్డీతో పునరుద్ధరించే వారికి కొంత ప్రయోజనం లభించవచ్చు. అయితే డిపాజిట్ రేట్ల పెంపు ప్రతి బ్యాంకులో ఒకే సమయంలో, ఒకే స్థాయిలో జరగదు.

### ఎవరి ఈఎంఐ పెరిగే అవకాశం?

అధిక ప్రభావం:
- రెపో రేటుకు అనుసంధానమైన గృహ రుణాలు
- బాహ్య ప్రమాణానికి అనుసంధానమైన చర వడ్డీ రుణాలు
- కొన్ని వాహన రుణాలు
- కొన్ని వ్యక్తిగత రుణాలు

----

తక్షణ ప్రత్యక్ష ప్రభావం లేనిది/తక్కువ:
- స్థిర వడ్డీ రుణాలు
- రీసెట్ తేదీ ఇంకా రాని కొన్ని చర వడ్డీ రుణాలు

# వీళ్లకు పస్తులు!

**మొదటి పేజీ తరువాయి**

వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి జీతాలు అందకపోవడంతో ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, నిత్యావసరాలు, కుటుంబ ఖర్చులు భారంగా మారాయని చెబుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయులే తమ కుటుంబ భవిష్యత్తు గురించి ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఐఎఫ్ఎంఎస్ నమోదే అడ్డంకా?

కొత్తగా నియమితులైన పార్ట్‌టైం ఉపాధ్యాయుల్లో ఐఎఫ్ఎంఎస్‌లో వివరాలు నమోదైన వారికి మాత్రమే వేతనాలు అందుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మిగిలిన వారి వివరాల నమోదు, వేతన బిల్లుల తయారీ ప్రక్రియలో హెడ్ఆఫీస్, జోనల్ కార్యాలయాల స్థాయిలో జాప్యం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఉద్యోగులు విధుల్లో చేరి నెలలు గడుస్తున్నా వారి వివరాలను సంబంధిత వ్యవస్థలో నమోదు చేయడం, బిల్లుల ప్రక్రియను పూర్తి చేయడంలో ఎందుకు ఆలస్యం జరిగిందన్నది అధికారులే సమాధానం చెప్పాల్సిన ప్రశ్నగా మారింది. వేతన బిల్లుల ప్రక్రియ సకాలంలో పూర్తయి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని ఉపాధ్యాయులు అంటున్నారు. పరిపాలనా ప్రక్రియలో జరిగిన జాప్యానికి ఉద్యోగులు, వారి కుటుంబాలు మూల్యం చెల్లించాల్సి రావడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

పండుగ పూట పస్తులేనా?

నెల జీతంతోనే కుటుంబాలను నెట్టుకొచ్చే ఉద్యోగులకు వరుసగా నాలుగు నెలల పాటు వేతనాలు అందకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. దసరా పండుగ సందర్భంగా పిల్లలకు కొత్త దుస్తులు కొనివ్వడం నుంచి ఇంట్లో కనీస పండుగ ఏర్పాట్లు చేసుకోవడం వరకు ప్రతి విషయం భారంగా మారిందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే చేతులకు జీతం అందకపోవడం.. పండుగ రోజు తమ పిల్లల ముఖాల్లో ఆనందం చూడలేని పరిస్థితి రావడం మానవీయంగా ఆలోచించాల్సిన అంశమని వారు అంటున్నారు.

తక్కువ వేతనాలు.. పెంపుపై ఎదురుచూపులు

ఇదిలా ఉండగా, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో పార్ట్‌టైం ఉపాధ్యాయుల వేతనాల పెంపు అంశాన్ని బోర్డు సమావేశ అజెండాలో చేర్చినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో తమకు కూడా మెరుగైన వేతనాలు లభిస్తాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇతర గురుకుల సొసైటీలతో పోలిస్తే తమకు తక్కువ వేతనాలు అందుతున్నాయని వారు పేర్కొంటున్నారు. మైనారిటీ గురుకులాల్లో జూనియర్ లెక్చరర్లకు రూ.36 వేల వరకు,



పీజీటీలు రూ.28 వేల వరకు వేతనాలు ఉండగా.. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో జూనియర్ లెక్చరర్లకు రూ.23,400, పీజీటీలకు రూ.18 వేలు మాత్రమే ఉందని చెబుతున్నారు. ఇప్పటికే తక్కువ వేతనాలతో పనిచేస్తున్న తమకు వేతనాల పెంపు ప్రతిపాదన బోర్డు అజెండాలోకి రావడం కొంత ఊరటనిచ్చిందని అంటున్నారు.

అధికారులు స్పందించాల్సిందే

విద్యార్థుల విద్య, వసతి, సంక్షేమ బాధ్యతలను మోస్తున్న ఉపాధ్యాయుల కుటుంబాల సంక్షేమం కూడా ప్రభుత్వ వ్యవస్థ దృష్టిలో ఉండాల్సిన అవసరం ఉంది. ఉద్యోగులు విధుల్లో ఉన్నప్పుడు వారి వేతనాల చెల్లింపులో జరిగే పరిపాలనా జాప్యం వారి కుటుంబాలపై ఆర్థిక భారంగా మారకూడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంఘిక సంక్షేమ గురుకులాల ఉన్నతాధికారులు, సంబంధిత జోనల్ కార్యాలయాలు, హెడ్ఆఫీస్ అధికారులు వెంటనే స్పందించి ఐఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ వివరాల నమోదును పూర్తి చేసి, నాలుగు నెలలుగా నిలిచిపోయిన వేతనాలను విడుదల చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. అలాగే బోర్డు సమావేశంలో వేతనాల పెంపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపి, ఇతర సొసైటీలతో పోల్చదగిన స్థాయిలో వేతనాలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'విద్యార్థుల భవిష్యత్తు కోసం మేము బాధ్యతగా పనిచేస్తున్నాం. మా కుటుంబాల పరిస్థితిని కూడా అధికారులు అర్థం చేసుకోవాలి. కనీసం దసరా పండుగకైనా నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలి. వేతనాల పెంపు ప్రతిపాదనను కూడా ఆమోదించి మాకు న్యాయం చేయాలి' అని పలువురు పార్ట్‌టైం ఉపాధ్యాయులు కోరుతున్నారు.

# ..పేటీఎం తొలగింపు

**మొదటి పేజీ తరువాయి**

షెడ్యూల్ నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మినహాయించినట్లు ఆర్బీఐ ఒక నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. సాధారణంగా షెడ్యూల్డ్ బ్యాంకులుగా గుర్తింపు పొందిన బ్యాంకుల వివరాలు ఈ జాబితాలో ఉంటాయి. జూలై 31న జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 7న గెజిట్ ఆఫ్ ఇండియాలో ప్రచురించారు. నియంత్రణ నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తుండటంతో, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లైసెన్స్‌ను ఆర్బీఐ రద్దు చేసింది. సంస్థ కార్యకలాపాలు డిపాజిటర్ల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని ఆ సమయంలో కేంద్ర బ్యాంకు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గత కొన్నేళ్లుగా పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఆర్బీఐ నిశిత పర్యవేక్షణలో కొనసాగుతోంది. 2022 మార్చిలో పలు లోపాలను గుర్తించిన ఆర్బీఐ, కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా బ్యాంకుపై నిషేధం విధించింది. సమగ్ర ఐటీ ఆడిట్




కోసం స్వతంత్ర సంస్థను నియమించాలని ఆదేశించింది. అయినప్పటికీ నిబంధనల ఉల్లంఘనలు కొనసాగడంతో, ఈ ఏడాది ప్రారంభంలో కస్టమర్ ఖాతాలు, వాలెట్లు, ప్రీపెయిడ్ సాధనాల్లో కొత్త డిపాజిట్లు, టాప్-అప్‌లను స్వీకరించకుండా పూర్తిస్థాయిలో ఆంక్షలు విధించింది. విజయ్ శేఖర్ శర్మ ప్రమోట్ చేసిన పేటీఎంకు ఇది అనుబంధ సంస్థ. వరుస నియంత్రణ చర్యలు, కార్యాచరణ ఆంక్షల నేపథ్యంలో ఈ బ్యాంక్ చివరకు తన లైసెన్స్‌ను కోల్పోయింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మూసివేయాలని ఢిల్లీ హైకోర్టు సైతం ఆదేశించడంతో దాని కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా వెలువడిన నోటిఫికేషన్‌తో ఈ ప్రక్రియ అధికారికంగా పూర్తయింది.



# 2047.. చేసి చూపిద్దాం!

**మొదటి పేజీ తరువాయి**

పదేళ్లలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి బయటపడగలరని ఎవరైనా ఊహించారా? కానీ. భారత్ దీనిని సాధ్యం చేసి చూపించింది. అందుకే 140 కోట్ల మంది భారతీయుల శక్తి సామర్థ్యాలపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. మన దేశం రూపాంతరం చెందడాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఫలితాలు కళ్లముందే కనిపిస్తున్నాయి. భారత్ ముందు సవాళ్లు ఉండొచ్చు గానీ 140 కోట్ల పరిష్కారాలు కూడా ఉన్నాయి. ఫ్లై దుబాయ్ విమానంలో ప్రయాణికులను రక్షించిన భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చార్ గురించి నేడు ప్రపంచం మాట్లాడుకుంటోంది. మేడ్ ఇన్ ఇండియా విమానాల గురించి కూడా ప్రపంచం మాట్లాడుకునే రోజు వస్తుంది. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఈ మైలురాయిని చేరుకుంటానని ఎప్పుడూ ఊహించలేదు. ప్రభుత్వ అధినేతగా అవిశ్రాంతంగా సేవలందిస్తూ ఈ రోజుతో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. నాపై నమ్మకం ఉంచిన దేశ ప్రజలకు ధన్యవాదాలు. నా దృష్టిలో ప్రజలే భగవంతుడు. కష్టపడి పనిచేసే బీజేపీ కార్యకర్తలే నా బలం. దేశ ప్రజల పాదపద్మాలకు భక్తిపూర్వకంగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. అలాగే బీజేపీ, ఎన్డీఏలోని నా సహచరులకు, ప్రజాస్వామ్యం పట్ల అపారమైన గౌరవం ఉన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. గత 25 ఏళ్లలో అనేక ఎన్నికలు జరిగాయి. అసెంబ్లీ ఎన్నికలైనా సరే, పార్లమెంటరీ ఎన్నికలైనా సరే ప్రజలు ఎల్లప్పుడూ తమ సేవ కోసం నన్ను ఎన్నుకున్నారు. ఈ రోజు భారతదేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి కూడా వందనాలు సమర్పిస్తున్నాను. నేను ఎక్కడ ఉన్నా, ఏ పదవిలో ఉన్నా అందులో ప్రజలదే అత్యంత గొప్ప పాత్ర. నా దృష్టిలో ప్రజలు సాక్షాత్తు దైవస్వరూపులు. కోట్లాది మంది భారతీయుల విశ్వాసం, లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తల కఠోర శ్రమ ఎల్లవేళలా నాకు గొప్ప బలంగా నిలిచాయి. నేను గతాన్ని తిరిగి చూసుకున్నప్పుడు కృతజ్ఞతాభావం తప్ప మరేమీ కలగదు. నాకు ఎన్నో విషయాన్ని నేర్పించిన ప్రతి వ్యక్తికీ, ప్రతి అనుభవానికీ సర్వదా కృతజ్ఞుడిని. ఉపాధ్యాయులు నాకు వినయాన్ని నేర్పారు. నన్ను కిందకు లాగినవారు తిరిగి ఎలా పైకి లేవాలో నేర్పారు.



# చిన్నారులకు ఒబెసిటీ మాత్రలు వద్దు

**మొదటి పేజీ తరువాయి**

ఏమి లేవని పేర్కొంది. 10 ఏళ్లలోపు పిల్లలకు బరువు తగ్గించే ఒబెసిటీ మందులు (జీఎల్పీ-1 ఇంజెక్షన్లు) లేదా బేరియాట్రిక్ సర్జరీలు చేయకూడదని డబ్ల్యూహెచ్ స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ అంశమై చిన్న పిల్లల్లో ఈ మందుల దీర్ఘకాలిక ప్రభావాలు మరియు భద్రతపై సరైన ఆధారాలు లేవని పేర్కొంది. అందుకే చిన్న పిల్లల్లో బరువు తగ్గడానికి కేవలం పోషకాహారం, వ్యాయామం, జీవనశైలి మార్పులపైనే దృష్టి పెట్టాలని సూచించింది. అదే 10 నుండి 19 ఏళ్ల మధ్య వయసున్న యుక్తవయస్కులకు అన్ని రకాల జీవనశైలి మార్పులు విఫలమైనప్పుడు మాత్రమే వైద్యుల పర్యవేక్షణలో ఈ మందులను పరిశీలించవచ్చని తెలిపింది. ఒబెసిటీ సమస్యను కేవలం మందుల ద్వారా మాత్రమే పూర్తిగా నిర్మూలించలేమని ఈ మందులతో పాటు సరైన ఆహార నియమాలు , శారీరక శ్రమ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేసింది. టైప్-2 డయాబెటిస్, ఒబెసిటీ నియంత్రణకు వాడే కొన్ని కీలకమైన మందులను డబ్ల్యూహెచ్ఓ తన అత్యవసర ఔషధాల జాబితా లోచేర్చింది. ఈ మందుల ధరలు ప్రపంచవ్యాప్తంగా చాలా ఎక్కువగా ఉన్నందున, పేద దేశాలకు కూడా ఇవి అందుబాటులోకి వచ్చేలా ధరలను తగ్గించాలని జెనరిక్ మందుల తయారీని ప్రోత్సహించాలని డబ్ల్యూహెచ్ఓ పిలుపునిచ్చింది.

# వాళ్లకు పండుగ!

**మొదటి పేజీ తరువాయి**

విడతల వారీగా చెల్లించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా సుమారు రూ. 2,500 కోట్ల అదనపు భారం పడనుందని అంచనా. కేవలం బకాయిల చెల్లింపు కోసమే దాదాపు రూ. 6,174 కోట్లు అవసరమవుతాయి. తాజా పెంపుతో రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర అర్హత కలిగిన సిబ్బంది లబ్ధి పొందనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇప్పటికే వెల్లడించారు.

## అణువుల గుట్టు ఛేదించారు.. నోబెల్ బహుమతి పట్టేశారు!

**మొదటి పేజీ తరువాయి**

స్వీయ ఉత్ప్రేరణ ప్రక్రియను అభివృద్ధి చేసి ఈ రంగంలో మరో ముందడుగు వేశారు. ఈ ప్రక్రియలో ఒక చర్య ద్వారా ఏర్పడిన ఉత్పత్తి, తనంతట తానే ఉత్ప్రేరకంగా పనిచేస్తూ అదే రకమైన అణువుల ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల అతి స్వల్ప అసమతుల్యతతో ప్రారంభమైనా, చివరికి దాదాపుగా ఒకే రూపానికి చెందిన అణువులు మాత్రమే ఏర్పడతాయి. ఈ ఆవిష్కరణలు అద్భుతమైనవని, శతాబ్దానికి పైగా ఉన్న రసాయన రహస్యాన్ని ఇది ఛేదించిందని నోబెల్ కమిటీ ఛైర్మన్ హైనర్ లింకే కొనియాడారు. కగన్, సోయ్‌ల పరిశోధనలు సైద్ధాంతికంగానే కాకుండా ఆచరణలో కూడా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఔషధాల తయారీ, సువాసనలు, పరిమళాలు, ఇతర రసాయన పదార్థాల ఉత్పత్తిలో అవసరమైన చర్యలను రూపొందించడానికి వీరి ఆవిష్కరణలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ పురస్కారం కింద ఇద్దరు శాస్త్రవేత్తలు 12 మిలియన్ల స్వీడిష్ క్రోనార్ల ప్రైజ్ మనీని పంచుకుంటారు. డిసెంబర్ 10న స్టాక్‌హోమ్‌లో జరిగే కార్యక్రమంలో వీరికి పతకాలను ప్రదానం చేస్తారు.

## మహిళలకు రూ.2,500.. అంతా తూచ్!

**మొదటి పేజీ తరువాయి**

అమల్లోకి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా ఒక మార్ఫింగ్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఇది ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ ఉపయోగించి సృష్టించిన నకిలీ వీడియో అని ప్రభుత్వ ఫ్యాక్ట్-చెక్ విభాగం వెల్లడించింది. సీఎం రేవంత్ రెడ్డి చిత్రానికి డీప్‌ఫేక్ ఆడియోను జోడించి ఈ వీడియోను రూపొందించారని, ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పింది. ఈ నేపథ్యంలో, ప్రజలు ఇలాంటి నిరాధారమైన, తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. కేవలం ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసే సమాచారాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా, సోషల్ మీడియాలో ధ్రువీకరణ లేకుండా వచ్చే వార్తల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళల కోసం కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయి. అయితే, వైరల్ వీడియోలో పేర్కొన్నట్లుగా ప్రతినెలా రూ. 2,500 సాయం, రెండు తులాల బంగారం వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదని స్పష్టమవుతోంది. సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ కొందరు సృష్టిస్తున్న ఇలాంటి నకిలీ వార్తల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

# దసరాకు 7,000 ప్రత్యేక బస్సులు

**మొదటి పేజీ తరువాయి**

వివరాల ప్రకారం, కరీంనగర్ జోన్ పరిధిలో అత్యధికంగా 3,533 బస్సులు (ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1,175, వరంగల్ 530, ఖమ్మం 678) నడపనున్నారు. హైదరాబాద్ జోన్ నుంచి 2,155 బస్సులు (మహబూబ్‌నగర్ 645, మెదక్ 255, నల్గొండ 815, రంగారెడ్డి 440), గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1,312 ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అక్టోబర్ 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేస్తుండగా, తిరుగు ప్రయాణాల కోసం అక్టోబర్ 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఒక నూతన సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కాలనీలు, టౌన్‌షిప్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, హాస్టళ్లు, కళాశాలల నుంచి కనీసం 30 మంది ప్రయాణికులు ఒక బృందంగా ఏర్పడి ముందస్తుగా బుక్ చేసుకుంటే, వారి వద్దకే బస్సును పంపి పికప్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. ఈ ప్రత్యేక బస్సు సర్వీసులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టికెట్ ధరలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

# పార్టీ నాకు ఎన్నో అవకాశాలిచ్చింది

## ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తా.. పదవుల కోసం పాకులాడే వ్యక్తి కాదు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

కరీంనగర్, అక్టోబర్ 7 (ఈవార్తలు): కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు త్వరలో తెలంగాణ బీజేపీలో కీలక బాధ్యతలు అప్పగించనున్నారనే ప్రచారం జరుగుతున్న వేళ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు ఇచ్చిందని చెప్పారు. తాను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని, కార్యకర్తగా పార్టీ కోసం పనిచేస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో 'సేవా జ్యోతి' ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన బండి సంజయ్.. కేసీఆర్ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పడం అంతా డ్రామానేనని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే దమ్ము కాంగ్రెస్‌కు లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ సహా విపక్షాలు చేస్తున్న విమర్శలపై బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. 'ఓట్ చోరీ, సీట్ చోరీ' పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని ఆరోపించారు. 1946లో కాంగ్రెస్ పీసీసీలన్నీ సర్దార్ పటేల్ ప్రధాని కావాలని ప్రతిపాదించినా.. నెహ్రూను ప్రధాని చేశారని విమర్శించారు. దేశంలో బోగస్ ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్సే చెప్పిందని, ఇప్పుడు వాటిని తొలగిస్తుంటే ఎందుకు అభ్యంతరం చెబుతోందని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదన్నారు. కుటుంబం, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలు ఆయనకు అవసరం లేదని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ సహా కొన్ని పార్టీలు చెప్పే మాటలు నమ్మి యువత మోసపోవద్దని బండి సంజయ్ సూచించారు. 2014కు ముందు,



ఇప్పటి భారత్‌ను పోల్చి చూడాలని కోరారు. ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదన్నారు. రాజ్యాంగ సంస్థను బదనాం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. ఎన్నికల సంఘాన్ని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాలని రాహుల్ గాంధీకి సూచించారు. వందల మందితో వెళ్లి దాడి చేస్తే పోలీసులు అడ్డుకోక ఏం చేస్తారని ప్రశ్నించారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ లక్ష్యమన్నారు. తెలంగాణలో అక్రమ చొరబాటుదారుల ఓట్లపై కూడా బండి సంజయ్ ఆరోపణలు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోనే 30 వేలకు పైగా రోహింగ్యాల ఓట్లు ఉన్నాయని అన్నారు.

# రూ.40,000 కోట్ల భారం ఎవరిది?

### యాదాద్రి ప్లాంట్‌పై హరీశ్‌కు భట్టి సవాల్

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు గుప్పించారు. బొగ్గు సరఫరాకు సరైన ఏర్పాట్లు చేయకుండానే ప్లాంట్‌ను నిర్మించి రాష్ట్ర ప్రజలపై రూ.40,000 కోట్ల భారం మోపారని ఆరోపించారు. ఈ తప్పిదాలకు ఎవరు బాధ్యత వహించాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఎలాంటి కోతలు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తోందని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే, ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీశ్‌రావు ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు లింకేజీ ఇస్తామని హామీ ఇచ్చి యాదాద్రి ప్లాంట్‌ను ప్రారంభించిందని, కానీ ప్లాంట్‌కు అవసరమైన జీ9 గ్రేడ్ బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి గుర్తుచేశారు. సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలింది దిగుమతి చేసుకుంటామని ఒప్పందాలు చేసుకున్నా, బీఆర్ఎస్ హయాంలో వాటిని నెరవేర్చలేదని విమర్శించారు. బొగ్గు అనుసంధానం లేకుండానే ప్లాంట్‌ను నిర్మించారా లేదా అనే దానిపై హరీశ్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసి మూడు యూనిట్లను ప్రారంభించిందని భట్టి వివరించారు. జెన్‌కో, ట్రాన్స్‌కోలను ప్రైవేటీకరిస్తారంటూ వస్తున్న వార్తలను ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ప్రతిపక్షాలు విద్యుత్ అంశంపై రాద్ధాంతం చేస్తున్నాయని, తమ ప్రభుత్వానికి ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు.

# ఎస్సీ రోస్టర్‌లో మార్పులు చేస్తే ఉద్యమిస్తాం

### మంద కృష్ణ మాదిగ హెచ్చరిక

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): ఎస్సీ రోస్టర్ పాయింట్లలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే తీవ్రంగా వ్యతిరేకిస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణలో జనాభా ప్రాతిపదికన మాదిగలకు తగిన వాటా దక్కలేదని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట మంగళవారం రాత్రి జరిగిన ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లను పెంచి, వర్గీకరణకు అనుగుణంగా మాదిగలకు 14 శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. జనాభా లెక్కలు పూర్తయిన తర్వాత ఎస్సీ రిజర్వేషన్లను పెంచుతామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని మంద కృష్ణ కోరారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత రోస్టర్ సవరణ పేరుతో మరో వివాదానికి తెరతీయడం సరికాదన్నారు. కుల వివక్ష నిర్మూలన, సామాజిక న్యాయం కోసం మాలలు సహా అన్ని సామాజిక వర్గాలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని కోరారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై వచ్చే మార్చిలో 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలను కలుపుకుని సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతల నిర్మూలన కోసం ఉద్యమాలను కొనసాగిస్తామని మంద కృష్ణ తెలిపారు.

# ఎన్నారై భర్తకు వేధింపులు.. 2 కోట్లు డిమాండ్

### పాస్‌పోర్టు, ఇతర పత్రాలు లాక్కున్నారని బాధితుడి ఆవేదన

### బాధితుడి ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

పంజాగుట్ట, అక్టోబర్ 7 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వింత ఘటన వెలుగులోకి వచ్చింది. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనను బలవంతంగా ఆసుపత్రికి తీసుకెళ్లి పుంసత్వ పరీక్షలు చేయించి, రూ. 2 కోట్లు డిమాండ్ చేస్తూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కెనడా పౌరుడైన ఓ ఎన్నారై పోలీసులకు ఫిర్యాదు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దొమ్మరపోచంపల్లికి చెందిన బాధితుడికి ఇటీవలే వివాహమైంది. ఆయన ఫిర్యాదు ప్రకారం, గత నెల 7వ తేదీన తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనకు తెలియకుండా పాస్‌పోర్టు, కెనడియన్ పౌరసత్వ పత్రం, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకెళ్లారు. ఆ తర్వాత రెండు రోజులకు, అంటే 9వ తేదీన, తనను బెదిరించి సోమాజిగూడలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లి బలవంతంగా పుంసత్వ పరీక్షలు చేయించారు. ఆ పరీక్షల తర్వాత, అతడికి నపుంసకత్వం ఉందని అసత్య ప్రచారం చేస్తూ, ఈ విషయం బయటపెట్టకుండా ఉండాలంటే రూ. 2 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి వేధింపులు భరించలేక, బాధితుడు పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. తనను బెదిరింపులకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు.

# మంత్రి కోమటిరెడ్డి ఉదారత

### శిశువు వైద్యం కోసం మంత్రిని ఆశ్రయించిన దంపతులు

### అండగా నిలిచిన కోమటిరెడ్డి.. వైద్యానికి చేయూత

### తక్షణ సాయంగా రూ. 2 లక్షల ఆర్థిక సహాయం



నల్గొండ, అక్టోబర్ 7 (ఈవార్తలు): రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. పుట్టుకతో మాట, వినికిడి లోపంతో బాధపడుతున్న నవజాత శిశువు వైద్యం కోసం ఓ నిరుపేద బధిర దంపతులకు ఆయన రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చి వారికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితే, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఫణిగిరి గ్రామానికి చెందిన జంపాల మహేశ్ కుమార్, రజిత దంపతులు పుట్టుకతోనే మూగ, బధిరులు. ఇటీవల వారికి జన్మించిన శిశువుకు కూడా ఇదే సమస్య ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్న వయసులోనే సర్జరీ చేస్తే బిడ్డకు మాట, వినికిడి వచ్చే అవకాశం ఉందని, అయితే అందుకు లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ దంపతులు హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డిని ఈరోజు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. వారి పరిస్థితికి చలించిపోయిన మంత్రి, చిన్నారిని చేతుల్లోకి తీసుకుని వారికి ధైర్యం చెప్పారు. తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం వెంటనే రూ. 2 లక్షల రూపాయల సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "మీ చిన్నారి గురించి ఆందోళన వద్దు. ఆ బిడ్డకు మాటలు వచ్చేలా చేసే బాధ్యత నాది. మీకు ఎలాంటి సహాయం కావాలన్నా నేనున్నాను" అని వారికి భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, మెరుగైన శస్త్రచికిత్స కోసం ప్రత్యేక వైద్యులతో తానే స్వయంగా మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో ఆ దంపతులు భావోద్వేగానికి గురై కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తున్న మంత్రి కోమటిరెడ్డిని స్థానికులు ప్రశంసించారు.

# సిర్పూర్-కాగజ్‌నగర్ రైలులో మంటలు



### తప్పిన ముప్పు.. బీబీనగర్ సమీపంలో ఘటన

భువనగిరి, అక్టోబర్ 7 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్-కాగజ్‌నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్‌లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో-పైలట్, లోకో పైలట్‌ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు స్పష్టం చేశారు. అనంతరం సాంకేతిక సిబ్బంది అవసరమైన మరమ్మతులు పూర్తి చేయడంతో రైలు తిరిగి సిర్పూర్-కాగజ్‌నగర్‌కు బయలుదేరింది. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

# సర్కారుకు షాక్.. క్రిశాంక్‌కు బెయిల్

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమార్తె నైమిశా రెడ్డిపై సోషల్ మీడియాలో ఆరోపణలు చేసిన కేసులో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో పాక్షిక ఊరట లభించింది. ఈ కేసులో తొందరపడి అరెస్ట్ చేయవద్దని, చట్ట ప్రకారం ముందుకెళ్లాలని పోలీసులను ఆదేశించింది.



దర్యాప్తులో భాగంగా క్రిశాంక్‌కు ముందుగా భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) 2023లోని సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేసింది. సీఎం కుమార్తె ఆస్తులు, ఫార్మా కంపెనీల గురించి సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ చేసిన ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అక్టోబర్ 5న క్రిశాంక్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని సెక్షన్ 353(2) (పుకార్లు వ్యాప్తి చేసి శత్రుత్వం పెంచడం), 352 (శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం) కింద కేసు పెట్టారు. దీంతో పోలీసులు తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ క్రిశాంక్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ టి. మాధవీ దేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. తప్పుడు ఫిర్యాదుతో పోలీసులు గుడ్డిగా కేసు నమోదు చేశారని, సివిల్ దుస్తుల్లో తనను అనుసరిస్తున్నారని క్రిశాంక్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే, ఎఫ్ఐఆర్ ప్రాథమిక దశలోనే ఉందని, ఎలాంటి ఉపశమనం ఇవ్వకూడదని ప్రభుత్వ న్యాయవాది కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. పోలీసులు దర్యాప్తు చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అయితే, సుప్రీంకోర్టు "అర్నేష్ కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బీహార్" కేసులో ఇచ్చిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. దర్యాప్తునకు క్రిశాంక్ పూర్తిగా సహకరించాలని సూచిస్తూ, ప్రస్తుత దశలో అరెస్ట్‌పై ఎలాంటి నిషేధం విధించలేదు. ఇదిలా ఉండగా, సీఎం కుటుంబంపై ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేశారన్న మరో కేసులో గోపాలపురం పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేశారు. అయితే, సికింద్రాబాద్ కోర్టు ఆయనకు షరతులు లేని బెయిల్ మంజూరు చేసింది.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.





## జగిత్యాలకు 3 జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు

జగిత్యాల, అక్టోబర్ 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రానికి మూడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు కావడంతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు బార్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యేను ఆయన శిబిర కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. అదనపు కోర్టుల ఏర్పాటుతో న్యాయవాదులు, కక్షిదారులకు మెరుగైన న్యాయ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కోర్టుల నిర్వహణకు తాత్కాలిక భవనం కేటాయించాలని కోరగా, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్‌గా దామోదర్‌రావు నియామకంపైనా ఎమ్మెల్యేకు బార్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## పోలీసు నంబర్‌తో ప్రైవేట్ కారు?

### ఒకే రిజిస్ట్రేషన్ నంబర్‌పై సందేహాలు




జగిత్యాల, అక్టోబర్ 7 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో పోలీసు వాహనానికి చెందిన రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఓ ప్రైవేట్ కారు తిరుగుతున్నట్లు వచ్చిన సమాచారం చర్చనీయాంశంగా మారింది. జగిత్యాల టౌన్ సీఐ వినియోగించే పోలీసు వాహనం రిజిస్ట్రేషన్ నంబర్‌తోనే ఓ ప్రైవేట్ షిఫ్ట్ కారు రోడ్డుపై తిరుగుతున్నట్లు సమాచారం. ఆ కారుపై వెనుక భాగంలో 'పోలీస్' అనే బోర్డు కూడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఓవర్‌స్పీడ్ చలాన్‌కు సంబంధించిన 2020 మార్చి 16 నాటి ఫొటోలో ప్రైవేట్ షిఫ్ట్ కారు కనిపించడంతోపాటు, దానికి పోలీసు వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ నమోదై ఉన్నట్లు సమాచారం. ఒకే రిజిస్ట్రేషన్ నంబర్ రెండు వాహనాలకు ఎలా ఉండొచ్చన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై సంబంధిత పోలీసు శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.



## తెలంగాణకు రేవంత్ శని: జీవన్ రెడ్డి

జగిత్యాల, అక్టోబర్ 7 (ఈవార్తలు): రాష్ట్రంలో సాగునీరు, విద్యుత్ కొరతతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సరైన ప్రణాళిక రూపొందించడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం జగిత్యాల తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో సాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడిందని ఆయన అన్నారు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోస్తే ఉత్తర తెలంగాణకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. దేవాదుల ప్రాజెక్టులో 10 పంపుసెట్లు ఉండగా ఐదు మాత్రమే పనిచేస్తున్నాయని, నీటిని ఎత్తిపోసే సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించడం లేదని ఆరోపించారు. కేసీఆర్‌పై మూడేళ్లుగా అవినీతి ఆరోపణలు చేస్తున్నా కనీసం రూ.3 అవినీతినైనా నిరూపించలేకపోయారని జీవన్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ ఆస్తులపై బీఆర్ఎస్ నేతలు చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాల కోసం హైదరాబాద్ ఫోర్త్ సిటీలో ప్రత్యేక కాలనీ నిర్మించాలని కోరారు. ఎస్సారెస్పీ, కన్నెపల్లి నుంచి తక్షణమే నీటిని విడుదల చేసి పొట్ట దశలో ఉన్న వరి పంటను కాపాడాలని డిమాండ్ చేశారు. పంట నష్టం జరిగితే పంట విరామం ప్రకటించి ఎకరాకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, అయిల్నేని వెంకటేశ్వరరావు, వోళ్లం మల్లేశం, అల్లాల ఆనంద్‌రావు, శీలం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## పత్రికల బకాయిలు చెల్లించాలి

### సమాచార శాఖ కమిషనర్‌కు టీఎంఎస్‌పీజేఏ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 7 (ఈవార్తలు): ప్రభుత్వ శాఖల నుంచి పత్రికలకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని టీఎంఎస్‌పీజేఏ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపూరావు ఆధ్వర్యంలో బుధవారం సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ జి.ముకుందరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్ బిల్లులు ఆర్థిక శాఖ మంత్రి పరిశీలనలో ఉన్నాయని, త్వరలో చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. చిన్న, మధ్యతరహా పత్రికలకు ప్రభుత్వ ప్రకటనల్లో 30 శాతం వాటా కల్పించాలని బాపూరావు కోరారు. బిల్లుల సమర్పణకు ఆన్‌లైన్ విధానం అమలు చేయాలని, జర్నలిస్టులకు ప్రమాద బీమా, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీ పాలక మండలిలో టీఎంఎస్‌పీజేఏకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, కంతేటి రమాదేవి, మిట్టపల్లి సురేందర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయంలో పోచమ్మ విగ్రహం మాయం

### 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో చోరీ



మల్యాల, అక్టోబర్ 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని కొత్తపేట ముత్యాల పోచమ్మ ఆలయ సమీపంలో ఉన్న బంగారు పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహం సహా పలు వస్తువులు కనిపించకుండా పోయాయి. సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది. ఆలయంలోని రాతి పోచమ్మ విగ్రహంతోపాటు రెండు గంగిరెద్దుల మట్టి విగ్రహాలు, నైవేద్య కుండలు, విగ్రహం కింద ఉంచిన పెద్ద రాయి కూడా కనిపించకుండా పోయినట్లు స్థానికులు తెలిపారు.

# ఘనంగా 'సేవా జ్యోతి యాత్ర'

**సిరిసిల్లలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ' ప్రజా సేవే మోదీ ప్రస్థానానికి స్ఫూర్తి: రెడ్డబోయిన గోపి**

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 7 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 76వ జన్మదినోత్సవం, ఆయన 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 'వికసిత్ భారత్ సంకల్ప సభ–సేవా జ్యోతి యాత్ర'ను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద అమరవీరుల స్థూపం సమీపంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని రెడ్డబోయిన గోపి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి తదితరులతో కలిసి వీక్షించారు. అనంతరం 'సేవా జ్యోతి యాత్ర'ను ప్రారంభించారు. రథంపై జ్యోతిని వెలిగించగా, చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ కాగడాను వెలిగించి పెద్దిరెడ్డికి అందజేశారు. అక్కడి నుంచి పాత బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా గాంధీచౌక్ వరకు బీజేపీ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పేదరిక నిర్మూలన, అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రం అప్పుల భారంలో కూరుకుపోయిందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో ప్రాజెక్టులు, విద్యుత్, తాగునీటి సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణ అభివృద్ధితోపాటు చేనేత రంగం పునరుజ్జీవానికి బీజేపీ ప్రభుత్వం అవసరమని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ




కార్యకర్తలు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. మోదీ ప్రజా సేవా ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సేవా భావాన్ని ప్రజల్లో మరింత విస్తరించాలని సూచించారు. జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం బీజేపీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యకర్తలు ప్రజలతో మమేకమై సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, మండలాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతుల ఉసురు తగులుతుంది: సుంకె రవిశంకర్

గంగాధర, అక్టోబర్ 7 (ఈవార్తలు): విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం గంగాధర మధురానగర్ వద్ద కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని విమర్శించారు. పొట్ట దశలో ఉన్న వరి పంటకు నీరు అవసరమని, విద్యుత్ కోతల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను కనీసం 12 గంటలపాటు అందించాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. ధర్నాతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు సుంకె రవిశంకర్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## కార్మికుల జీతాలు చెల్లించాలి

**దసరా, బతుకమ్మ కానుకలు ఇవ్వాలి: బీజేపీ నేతలు.. రెండు రోజుల్లో చెల్లించకపోతే మున్సిపల్ కార్యాలయం ముట్టడి**



వేములవాడ అర్బన్, అక్టోబర్ 7 (ఈవార్తలు): వేములవాడ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు, దసరా బోనస్, పండుగ కానుకలను తక్షణమే అందించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కౌన్సిలర్ కుమ్మరి శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వేములవాడ పట్టణ పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల పాత్ర కీలకమని వారు పేర్కొన్నారు. ప్రతిరోజూ పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు వేతనాలు నిలిపివేయడం సరికాదన్నారు. గత జూలై నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. ప్రతి ఏడాది దసరా సందర్భంగా అందించే దుస్తులు, చెప్పులు, నూనె, సబ్బులు, సర్ఫ్ వంటి పండుగ కానుకలు కూడా గతేడాది నుంచి అందలేదని పేర్కొన్నారు. బతుకమ్మ, దసరా పండుగల సమయంలో జీతాలు, బోనస్ అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో సహా, సమానంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే నిధులు లేదా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి నిధులు సర్దుబాటు చేసి పెండింగ్ వేతనాలు, దసరా బోనస్, ఇతర కానుకలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే బీజేపీ కౌన్సిలర్లు, నాయకుల ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.




## కాలేజీ భవనం లేదు.. హాస్టల్ వసతీ లేదు!

### జగిత్యాలలో వైద్య విద్యార్థుల ఆందోళన

జగిత్యాల, అక్టోబర్ 7 (ఈవార్తలు): మూడేళ్లుగా తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపిస్తూ జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. కళాశాల భవన నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు తెలిపారు. వసతి గృహం లేక అవస్థలు పడుతున్నామని, రేకుల షెడ్లలోనే తరగతులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస ప్రయోగశాల సౌకర్యాలు కూడా సక్రమంగా లేవని ఆరోపించారు. మౌలిక వసతుల కొరతతో వైద్య విద్యపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.



## ఇస్లాంపూర్ అభివృద్ధికి నిధులు

### పలు పనులకు ప్రొసీడింగ్స్ అందజేత

### ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్

గంగాధర, అక్టోబర్ 7 (ఈవార్తలు): గంగాధర మండలం ఇస్లాంపూర్ గ్రామ అభివృద్ధికి పలు పనులకు ప్రొసీడింగ్స్ మంజూరు చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సర్పంచ్ బారాజు ప్రభాకర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో మంచినీటి బావి నిర్మాణం, ప్రభుత్వ పాఠశాలకు బోర్‌వెల్, మరుగుదొడ్ల నిర్మాణం, పాఠశాల మరమ్మతుల పనులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు గౌడ సంఘం ఆధ్వర్యంలోని ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులపై ఎమ్మెల్యేను కోరిన వెంటనే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం పట్ల సర్పంచ్, పాలకమండలి సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి మరింత అభివృద్ధి జరిగేలా సహకరించాలని ఎమ్మెల్యేను కోరారు.



## ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

**యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం**

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరియాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో చిక్కుకున్న వారిని యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు.

## ఎండీఆర్‌తో యూపీఐకి ఇబ్బందేం లేదు: ఆర్బీఐ

న్యూఢిల్లీ: యూపీఐ ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై స్వల్పంగా విధించనున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వల్ల లావాదేవీల పరిమాణంపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. అక్టోబర్ 15 నుంచి రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం యూజర్ ఛార్జీ అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం ద్రవ్య పరపతి విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కొత్త ఛార్జీల వల్ల యూపీఐ లావాదేవీలు తగ్గుతాయా అని ప్రశ్నించగా, “ప్రస్తుతానికి లావాదేవీల పరిమాణంలో ఎలాంటి తగ్గుదల కనిపించడం లేదు. ఈ స్వల్ప రుసుము వల్ల వాల్యూమ్‌పై పెద్ద ప్రభావం ఉంటుందని నేను వ్యక్తిగతంగా భావించడం లేదు” అని ఆయన స్పష్టం చేశారు. ఎండీఆర్‌పై నిర్ణయం ఇప్పటికే తీసుకున్నామని, ఇది యూపీఐ వినియోగాన్ని దెబ్బతీయదని ఆయన వివరించారు. గత ఆరేళ్లుగా నిర్దిష్ట యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం రూ. 2,000కు పైబడిన లావాదేవీలపై ఎండీఆర్‌ను ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకే వర్తిస్తాయని, కస్టమర్లపై ఎలాంటి భారం ఉండదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతంలోనే స్పష్టం చేశారు. ఈ రుసుము ప్రభుత్వానికి కాకుండా, పేమెంట్ సేవలు అందించే సంస్థలకు చేరుతుందని ఆమె తెలిపారు.

## ఎయిర్‌టెల్ పోస్ట్‌పెయిడ్ ప్లాన్ల ధరల పెంపు

న్యూఢిల్లీ: దేశంలోని ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ తన పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు షాకిచ్చింది. పోస్ట్‌పెయిడ్ ప్లాన్ల టారిఫ్‌లను సుమారు 3 నుంచి 10 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ఈ కొత్త ధరలు గురువారం నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ స్పష్టం చేసింది. అయితే, ధరల పెంపుతో పాటు వినియోగదారులను ఆకర్షించేందుకు కొత్తగా ఉచిత అంతర్జాతీయ రోమింగ్ (ఐఆర్) ప్రయోజనాన్ని కూడా జోడించింది. తాజాగా సవరించిన ప్లాన్లన్నింటిలోనూ ప్రతి సిమ్‌కు ఏడాదికి ఒకసారి ఉచితంగా అంతర్జాతీయ రోమింగ్ ప్యాక్‌ను అందిస్తున్నట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. ఈ కాంప్లిమెంటరీ ప్యాక్‌లో భాగంగా 5 రోజుల వ్యాలిడిటీతో 5జీబీ డేటా, 60 నిమిషాల కాల్స్, 25 అవుట్‌గోయింగ్ ఎస్ఎంఎస్, ఉచిత ఇన్‌కమింగ్ ఎస్ఎంఎస్ వంటి ప్రయోజనాలు లభిస్తాయి.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ 3-పాయింట్ ఫార్ములా

**ఇంధన కేంద్రాలపై దాడులు ఆపాలని సూచన**

**ధాన్యం, ఇంధన రవాణా కొనసాగించాలని హితవు**

**వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలని ప్రతిపాదన**

**నల్ల సముద్రంలో వాణిజ్యానికి భద్రత కల్పించాలన సూచన**

కీవ్/మాస్కో:రష్యా-ఉక్రెయిన్ యుద్ధంతో ఏర్పడుతున్న నష్టాన్ని తగ్గించేందుకు భారత్ కీలక ప్రతిపాదన చేసింది. యుద్ధం వెంటనే పూర్తిగా ఆగకపోయినా.. దాని ప్రభావాన్ని తగ్గించేలా మూడు అంశాలతో కూడిన సంధి ప్రణాళికను సూచించింది. ఇంధన కేంద్రాలపై దాడులు ఆపడం, నల్ల సముద్రం ద్వారా ధాన్యం, ఇంధన రవాణాను కొనసాగించడం, వాణిజ్య నౌకలపై దాడులు నిలిపివేయడం ఇందులో ఉన్నాయి. భారత్ ప్రతిపాదించిన తొలి అంశం ఇంధన కేంద్రాలు, ఇతర కీలక మౌలిక వసతులపై దాడులు నిలిపివేయడం. విద్యుత్, ఇంధన వ్యవస్థలు దెబ్బతినకుండా చూడటం ద్వారా ప్రజల రోజువారీ జీవితం, ఆర్థిక కార్యకలాపాలపై యుద్ధ ప్రభావాన్ని తగ్గించవచ్చని భారత్ భావిస్తోంది. రెండో అంశం నల్ల సముద్రం రేవుల నుంచి ధాన్యం, ఇంధనం, సరకుల రవాణా కొనసాగించడం. యుద్ధం కారణంగా కీలక సరఫరా మార్గాలు దెబ్బతినకుండా చూడాలని భారత్ సూచించింది. ఆహారం, ఇంధన సరఫరాలో అంతరాయం రాకుండా ఇది ఉపయోగపడుతుందని భావిస్తోంది. మూడో అంశం వాణిజ్య నౌకల భద్రత. నల్ల సముద్రంలో వాణిజ్య నౌకలపై దాడులు పూర్తిగా ఆపాలని భారత్ ప్రతిపాదించింది. ఇప్పటివరకు జరిగిన చర్చల్లో ధాన్యం రవాణాకు ఎక్కువ ప్రాధాన్యం ఉండగా.. భారత్ మాత్రం అన్ని వాణిజ్య నౌకలకు భద్రత కల్పించే అంశాన్ని ముందుకు తెచ్చింది. ఇదే భారత ప్రతిపాదనను ప్రత్యేకంగా నిలబెడుతోంది. గతంలో వచ్చిన కొన్ని ప్రతిపాదనలు ధాన్యం రవాణాపైనే దృష్టి పెట్టాయి. అమెరికా ప్రతిపాదన ప్రధానంగా ఇంధన కేంద్రాలపై దాడులు ఆపే అంశానికి పరిమితమైంది. భారత్ మాత్రం ఇంధన వసతులు, సరకుల రవాణా, వాణిజ్య నౌకల భద్రతను ఒకే ప్రణాళికలో చేర్చింది.

## లోన్ వడ్డీ రేట్లు తగ్గించిన హెచ్‌డీఎఫ్‌సీ

న్యూఢిల్లీ: దాదాపు మూడు సంవత్సరాల తర్వాత ఆర్బీఐ కీలక రెపో రేట్లను పెంచింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకొని వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచుతున్నట్లు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. అయితే ఈ నిర్ణయం బ్యాంకులపై భారాన్ని మోపుతుంది. ఈ క్రమంలోనే ఆ భారాన్ని తగ్గించుకోవడానికి వెంటనే కస్టమర్లకు బదిలీ చేస్తుంది. అంటే ఈ రెపో రేటుకు




లింక్ అయి ఉండే లోన్ వడ్డీ రేట్లను పెంచుతుంది. దీంతో వారు ఈఎంఐ అధికంగా చెల్లించాల్సి వస్తుంది. అయితే ఈ సమయంలోనే అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గుడ్‌న్యూస్ చెప్పింది. లోన్లు తీసుకునే వారికి ఊరట కలిగించేలా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను తగ్గిస్తున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజాగా ప్రకటించింది. దీనినే నిధుల ఆధారిత వడ్డీ రేటుగా చెబుతుంటారు. దాదాపు అన్ని టెన్యూర్లపై ఎంసీఎల్ఆర్ తగ్గించగా గరిష్ఠంగా 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గింది. ఇది 2026, అక్టోబర్ 7 నుంచే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజా నిర్ణయంతో ఎంసీఎల్ఆర్‌కు లింక్ అయి ఉండే లోన్ వడ్డీ రేట్లు తగ్గుతాయని చెప్పొచ్చు. దీనిని అనుగుణంగా ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకున్నవారికి ఈఎంఐ, కాల వ్యవధి తగ్గుతుంది. అదే ఫిక్స్‌డ్ రేటుకు లోన్ తీసుకున్న వారికి ఎలాంటి ప్రభావం ఉండదు.

# మధ్యతరగతి బడ్జెట్‌కు మరో దెబ్బ



**రెపో రేటు పెంపుతో చర వడ్డీ రుణాలపై అదనపు భారం**

**ఇంటి రుణం.. కారు రుణం.. వ్యక్తిగత రుణం.. నెలవారీ ఖర్చులపై ఒత్తిడి**

**ఈఎంఐ పెంచకపోతే రుణ కాలం పెరిగే అవకాశం**

**(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)**

ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్య, వైద్యం, ఇంధనం, ఇంటి అద్దెల భారంతో కుటుంబ బడ్జెట్లు ఒత్తిడిలో ఉన్న సమయంలో రిజర్వు బ్యాంకు రెపో రేటును పెంచడం రుణగ్రహీతలకు మరో సవాలుగా మారనుంది. ముఖ్యంగా చర వడ్డీ రుణాలు తీసుకున్న కుటుంబాలపై దీని ప్రభావం క్రమంగా కనిపించే అవకాశం ఉంది. 25 బేసిస్ పాయింట్ల పెంపు చిన్నదిగా కనిపించినా, పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారికి మొత్తం వడ్డీ వ్యయంలో గణనీయమైన తేడా రావచ్చు. ఉదాహరణకు 20 ఏళ్ల మిగిలిన కాలానికి రూ.50 లక్షల గృహ రుణంపై వడ్డీ రేటు 7.25 శాతం నుంచి 7.50 శాతానికి పెరిగితే, సాధారణ గణన ప్రకారం నెలవారీ ఈఎంఐ సుమారు రూ.39,519 నుంచి రూ.40,280కు పెరుగుతుంది. అంటే నెలకు దాదాపు రూ.761 అదనపు భారం. సంవత్సరానికి ఇది సుమారు రూ.9,100. అదే విధంగా రూ.1 కోటి రుణంపై ఇదే పరిస్థితిలో నెలకు సుమారు రూ.1,522 అదనపు ఈఎంఐ పడుతుంది. రూ.2 కోట్ల రుణంపై అదనపు భారం నెలకు సుమారు రూ.3,043గా ఉండవచ్చు. ఇవి కేవలం ఉదాహరణ గణనలు మాత్రమే; వాస్తవ భారం బ్యాంకు వడ్డీ రేటు, మిగిలిన రుణ కాలం, రీసెట్ విధానం తదితరాలపై ఆధారపడి ఉంటుంది.

**ఉదాహరణ: రూ.50 లక్షల గృహ రుణంపై..!**

| అంశం | పెంపు ముందు | 25 బీపీఎస్ తర్వాత |
| --- | --- | --- |
| రుణం | 50 లక్షలు | 50 లక్షలు |
| మిగిలిన కాలం | 20 ఏళ్లు | 20 ఏళ్లు |
| వడ్డీ | 7.25% | 7.50% |
| అంచనా ఈఎంఐ | 39,519 | 40,280 |
| నెలకు అదనపు భారం | | 761 |
| ఏడాదికి అదనపు భారం | | సుమారు 9,100 |

**ఈఎంఐ పెరగకపోయినా భారం తప్పదా?**

అవును. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు ఈఎంఐ మొత్తాన్ని వెంటనే పెంచకుండా రుణ కాలపరిమితిని పెంచుతాయి. అలా జరిగితే నెలవారీ చెల్లింపు పెద్దగా మారకపోయినా, రుణగ్రహీత ఎక్కువ కాలం వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. ఫలితంగా మొత్తం చెల్లించే వడ్డీ పెరిగే అవకాశం ఉంటుంది. గృహ రుణంతో పాటు కారు రుణం, వ్యక్తిగత రుణం, విద్యా రుణం వంటి పలు రుణాలు ఉన్న కుటుంబాలకు వడ్డీ పెరుగుదల సమిష్టిగా మరింత ఒత్తిడిని సృష్టించవచ్చు. నెలవారీ ఆదాయంలో ఇప్పటికే ఈఎంఐలకు పెద్ద మొత్తాన్ని కేటాయిస్తున్న కుటుంబాల్లో పొదుపు తగ్గే అవకాశం ఉంటుంది. వినియోగ వ్యయం తగ్గితే రిటైల్ మార్కెట్‌పై కూడా ప్రభావం పడవచ్చు. మరోవైపు అధిక వడ్డీ రేట్లు కొత్తగా ఇల్లు, కారు లేదా ఇతర పెద్ద కొనుగోళ్లకు రుణం తీసుకునే వారి నిర్ణయాలను వాయిదా వేయించవచ్చు.

**కొత్త రుణగ్రహీతలకు మరింత జాగ్రత్త**

ఇప్పటికే రుణం తీసుకున్న వారికే కాకుండా కొత్తగా రుణం తీసుకునే వారిపైనా ప్రభావం ఉంటుంది. అధిక వడ్డీ రేటుతో రుణం ప్రారంభమైతే, దీర్ఘకాలంలో చెల్లించాల్సిన మొత్తం పెరుగుతుంది. అందువల్ల రుణం తీసుకునే ముందు కేవలం ‘నెలకు ఎంత ఈఎంఐ?’ అనే అంశాన్ని కాకుండా మొత్తం చెల్లించాల్సిన వడ్డీ, రుణ కాలపరిమితి, వడ్డీ రీసెట్ విధానం వంటి అంశాలను పరిశీలించడం కీలకం. రెపో రేటు పెంపు తక్షణంగా కుటుంబ బడ్జెట్‌ను కుదించే అంశంగా కనిపించినా, దీని అసలు ప్రభావం రుణ రీసెట్ చక్రం పూర్తయ్యే కొద్దీ స్పష్టమవుతుంది.

## డిసెంబర్‌లో మరోసారి రెపో రేటు పెంపు!




**50 బేసిస్ పాయింట్లు పెరగవచ్చు: ఎస్బీఐ రిసెర్చ్**

న్యూఢిల్లీ: రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ ‘జంబో హైక్’ వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

## నన్ను పోలీసులే కింద పడేశారు!

**ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన.. రాహుల్, ప్రియాంక సహా పలువురి అరెస్టు**



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఇండియా కూటమి ఎంపీలు బుధవారం ఢిల్లీలో చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జంతర్ మంతర్ వద్ద ధర్నాకు వెళుతున్న నేతలను పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ హైడ్రామా చోటుచేసుకుంది. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు పలువురు ఎంపీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ‘ఓట్ల చోరీ’ జరిగిందని ఆరోపిస్తూ, సీఈసీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఎంపీలు ఈ నిరసనకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సౌహార్ద విందు అనంతరం ఎంపీలందరూ బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే, మార్గమధ్యంలో అశోకా రోడ్డు వద్ద పోలీసులు భారీ భద్రతా వలయంతో బస్సులను నిలువరించారు. దీంతో ఎంపీలు రోడ్డుపైనే బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ప్రియాంక గాంధీ, మరికొందరు మహిళా ఎంపీలు రోడ్డుపై పడుకుని తమ నిరసనను వ్యక్తం చేశారు. పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. తనను అదుపులోకి తీసుకునే క్రమంలో మహిళా పోలీసులు కిందకు తోసేసి, గాయపరిచారని ప్రియాంక గాంధీ ఆరోపించారు. రాహుల్ గాంధీని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని వాహనంలో తరలించారు. కొందరు ఎంపీలు బస్సుల పైకెక్కి జాతీయ జెండాలు ఊపుతూ నిరసన తెలిపారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్, టీఎంసీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఐయూఎంఎల్ పార్టీల ఎంపీలు పాల్గొనగా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు గైర్హాజరు కావడం గమనార్హం.

## స్టాక్ మార్కెట్ కుదేల్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లకు బుధవారం భారీ షాక్ తగిలింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.5 శాతానికి చేర్చడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో వరుసగా రెండు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 429.11 పాయింట్లు నష్టపోయి 72,638.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 173.05 పాయింట్లు కోల్పోయి 22,603.05 వద్ద స్థిరపడింది. ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచడంతో పాటు తన ద్రవ్య విధాన వైఖరిని ‘క్యాలిబ్రేటెడ్ టైటనింగ్’గా మార్చింది. దీంతో రానున్న రోజుల్లో వడ్డీ రేట్ల పరిస్థితి మరింత కఠినంగా ఉండొచ్చన్న ఆందోళన ఇన్వెస్టర్లలో పెరిగింది. ఫలితంగా మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 22,700 స్థాయిని కోల్పోయి 22,600 కీలక మద్దతు స్థాయికి చేరిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 22,600 కంటే దిగువన స్థిరంగా కొనసాగితే 22,400 వరకు పడిపోయే అవకాశం ఉందన్నారు. పైకి వెళ్లాలంటే 22,800 స్థాయి కీలక అడ్డంకిగా ఉంటుందని పేర్కొన్నారు. నిఫ్టీలో టైటాన్ కంపెనీ, బీఈఎల్, హిందాల్కో ఇండస్ట్రీస్ షేర్లు భారీగా నష్టపోయాయి. ముఖ్యంగా మెటల్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. విస్తృత మార్కెట్‌లోనూ బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.63 శాతం పడిపోయింది. అయితే నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.30 శాతం లాభపడటం కొంత ఊరటనిచ్చింది. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ సూచీ అత్యధికంగా నష్టపోయింది. మరోవైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ లాభాల్లో ముగిసి మార్కెట్‌కు కొంత మద్దతుగా నిలిచింది. ఇక రానున్న రోజుల్లో ఆర్బీఐ నిర్ణయాలు ఆర్థిక వృద్ధి, మార్కెట్‌లో నగదు లభ్యత, కంపెనీల ఆదాయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఇన్వెస్టర్లు పరిశీలించనున్నారు. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల సీజన్ కూడా మార్కెట్‌కు కీలకం కానుంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలను కంపెనీలు ఎలా ఎదుర్కొంటాయి? ధరలను కొనసాగించగలవా? డిమాండ్‌ను నిలబెట్టుకోగలవా? అన్న అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నారు.

## ప్లేగు ముప్పు లేదు: రష్యా

మాస్కో: తూర్పు సైబీరియాలోని ఇర్కుట్స్క్ రీజియన్‌లో ఓ ల్యాబొరేటరీ ఉద్యోగి మృతి చెందడంతో ప్లేగు మహమ్మారి వ్యాప్తి చెందుతుందనే ఆందోళనలపై రష్యా స్పందించింది. ఇది కేవలం ల్యాబ్‌కు పరిమితమైన ఒకేఒక్క ఘటన అని, ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసింది. అయితే, ఈ విషయంలో మరింత పారదర్శకత అవసరమని అమెరికా కోరడంతో అంతర్జాతీయంగా ఈ ఘటనపై చర్చ మొదలైంది. రష్యా ఆరోగ్య పర్యవేక్షణ సంస్థ ‘రోస్పోట్రెబ్నాడ్జోర్’ ఈ వార్తలను తోసిపుచ్చింది. ఇర్కుట్స్క్ ప్రాంత ప్రజలకు ఎలాంటి అంటువ్యాధి ప్రమాదం లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మరణించిన ఉద్యోగితో సన్నిహితంగా మెలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని, ఎవరిలోనూ ఇన్‌ఫెక్షన్ లేదా ప్రమాదకరమైన వ్యాధికారక క్రిముల ఆనవాళ్లు కనిపించలేదని స్పష్టం చేసింది. ముందుజాగ్రత్త, నివారణ చర్యలు పూర్తిస్థాయిలో అమలు చేశామని, ఈ పరిస్థితిపై ప్రపంచ ఆరోగ్య సంస్థకు కూడా సమాచారం అందించామని పేర్కొంది. క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా ఈ విషయంపై స్పందించారు. నిబంధనల ప్రకారమే గత వారంలో డబ్ల్యూహెచ్ఓకు సమాచారం అందించామని ధృవీకరించారు. కొన్ని మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనపై మరింత పారదర్శకత కోరుతూ అమెరికా దౌత్యపరంగా ఫిర్యాదు చేసిందని తెలిపారు. అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని ఆయన సూచించారు.

## యూపీ బ్రాహ్మణ ఓట్లపై కాంగ్రెస్ గురి

**యూపీ పీసీసీ అధ్యక్షురాలిగా ఆరాధన మిశ్రా**

న్యూఢిల్లీ/లక్నో: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అజయ్ రాయ్ స్థానంలో బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన ఆరాధన మిశ్రా మోనాను అధిష్ఠానం నియమించింది. రాష్ట్రంలో చేజారిన బ్రాహ్మణ ఓటు బ్యాంకును తిరిగి దక్కించుకోవడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. అయితే, దశాబ్దం క్రితం విఫలమైన పాత వ్యూహాన్నే కాంగ్రెస్ పునరావృతం చేస్తోందన్న విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ ఇటువంటి వ్యూహాన్నే అనుసరించింది. అప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సూచన మేరకు, బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన షీలా దీక్షిత్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా రంగంలోకి దింపింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 10 నుంచి 12 శాతం ఉన్న బ్రాహ్మణ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటే పార్టీకి పూర్వవైభవం లభిస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఆ ప్రయోగం ఆశించిన ఫలితాలను ఇవ్వకపోగా, తీవ్రంగా బెడిసికొట్టడంతో కాంగ్రెస్ కేవలం ఏడు స్థానాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మరోసారి అదే బాటలో పయనిస్తున్న కాంగ్రెస్‌కు, ఈసారి మిత్రపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచే సవాళ్లు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ తన ‘పీడీఏ’ (పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక్) నినాదాన్ని మరింత విస్తృతం చేశారు. పీడీఏలోని ‘పి’ అంటే ‘పండిట్’ (బ్రాహ్మణులు) అని కూడా అర్థం చెబుతూ ఆ సామాజికవర్గ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రాహ్మణులను విస్మరిస్తోందని ఆయన నిరంతరం విమర్శలు గుప్పిస్తున్నారు.

## రైల్వేల్లో 3,477 ఎన్‌టీపీసీ గ్రాడ్యుయేట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

**నేటి నుంచి నవంబర్ 6 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం**




న్యూఢిల్లీ: భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు దేశవ్యాప్తంగా నిరుద్యోగులకు గొప్ప తీపి కబురు అందించాయి. నాన్-టెక్నికల్ పాపులర్ కేటగిరీల కింద గ్రాడ్యుయేట్ స్థాయి వివిధ పోస్టుల నియామకం కోసం కేంద్ర ఉపాధి పేరిట ఓ సూచనాత్మక ప్రకటనను జారీ చేశాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్ఆర్‌బీ ప్రాంతాల పరిధిలో కలిపి మొత్తం 3,477 తాత్కాలిక ఖాళీలను భర్తీ చేయనున్నట్లు రైల్వే బోర్డులు అధికారికంగా వెల్లడించాయి. ఈ నియామకాలకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి కేవలం ఆన్‌లైన్ విధానంలోనే దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 8వ తేదీన ప్రారంభమై.. నవంబర్ 6వ తేదీ రాత్రి 23.59 గంటల వరకు కొనసాగుతుంది. అభ్యర్థుల వయస్సును 2027 జనవరి ఒకటో తేదీ వరకు లెక్కించనున్నారు. వయోపరిమితి, విద్యార్హతలు, వైద్య ప్రమాణాల (మ్యాచింగ్ మెడికల్ స్టాండర్డ్స్) పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచే వివరణాత్మక నోటిఫికేషన్‌లో పేర్కొననున్నారు.

వయ్యారి చిత్రం



నిధి అగర్వాల్



## రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్న కియారా దంపతులు

బాలీవుడ్ స్టార్ జంట కియారా అద్వానీ, సిద్ధార్థ్ మల్హోత్రా తమ అభిమానులకు శుభవార్త చెప్పారు. తాము రెండోసారి తల్లిదండ్రులు కాబోతున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. తమ కుమార్తె సారాయా చేతులతో పాటు, తమ చేతులను కలిపి ఉంచి, మధ్యలో ఓ జత చిన్నారి బూట్లను పట్టుకున్న అందమైన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "మరోసారి గొప్ప బహుమతితో మేం ఆశీర్వదించబడ్డాం. మా హృదయాలు ప్రేమ, కృతజ్ఞతతో నిండిపోయాయి" అని ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. వీరి మొదటి గర్భం గురించి ప్రకటించినప్పుడు కూడా ఇలాంటి ఫొటోనే పంచుకోవడం విశేషం. ఈ పోస్ట్ క్షణాల్లో వైరల్ అయింది. 2021లో వచ్చిన 'షేర్షా' సినిమా షూటింగ్ సమయంలో ప్రేమలో పడిన కియారా, సిద్ధార్థ్ 2023 ఫిబ్రవరిలో రాజస్థాన్‌లో ఘనంగా వివాహం చేసుకున్నారు. వీరికి 2025 జూలై 15న మొదటి సంతానంగా కుమార్తె సారాయా మల్హోత్రా జన్మించింది. మరోవైపు, ఈ వార్త తెలియగానే చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఫిల్మ్‌మేకర్ కరణ్ జోహార్ "లవ్ లవ్ యూ" అని కామెంట్ చేయగా... నటులు కరీనా కపూర్ ఖాన్, అతియా శెట్టి, భూమి పెడ్నేకర్, డిజైనర్ మనీష్ మల్హోత్రా వంటి ప్రముఖులు ఈ జంటకు అభినందనలు తెలిపారు.



## ప్రభాస్ బర్త్‌డే ట్రీట్..

పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ (=వఎవశ్రీ క్ష్మితీ ౹ాతీుఎఝ్షుం) నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే ట్రేడ్ వర్గాలతో పాటు సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన అందాల భామ ఇమాన్వి కథానాయికగా నటిస్తోంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు సోషల్ మీడియాను షేక్ చేయడమే కాకుండా, సినిమాపై అంచనాలను ఆకాశానికి తాకేలా చేశాయి. ఇక ఈ మూవీలో బాలీవుడ్ దిగ్గజాలు అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తితో పాటు భానుచందర్, జయప్రద వంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో అలరించబోతున్నారు. అయితే, ఈ సినిమాకి సంబంధించి ఇప్పటివరకు కేవలం పోస్టర్లు మాత్రమే వచ్చాయి కానీ అధికారిక టీజర్ రాకపోవడంతో ప్రభాస్ ఫ్యాన్స్ కొంత నిరాశకు గురవుతున్నారు. కానీ, డార్లింగ్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'ఫౌజీ' మూవీ నుంచి ఒక అదిరిపోయే మాస్ అప్‌డేట్ ఇవ్వబోతున్నారట. ప్రభాస్ బర్త్ డే కానుకగా ఈ సినిమా టీజర్‌ను లేదా స్పెషల్ గ్లింప్స్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్ర బృందం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 23వ తేదీన ఈ మూవీ నుంచి దాదాపు మూడు నిమిషాలు ఉన్న టీజర్ విడుదలయ్యే అవకాశం ఉందంటూ నెట్టింట పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ టీజర్ కనుక వస్తే మాత్రం అభిమానులకు అది సరికొత్త విజువల్ ఫీస్ట్, భారీ ట్రీట్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. మరోవైపు డిసెంబర్‌లో విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాల వల్ల వాయిదా పడిన సంగతి తెలిసిందే. అయితే 'ఫౌజీ'ని కేవలం ఒక సినిమాగా కాకుండా, ఇండియన్ సినిమా గర్వించదగ్గ ఒక అద్భుతమైన విజువల్ వండర్‌గా మలిచేందుకు చిత్ర బృందం రాత్రింబవళ్లు ఎంతో శ్రమిస్తోందట. ప్రస్తుతం జరుగుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ అక్టోబర్ 20వ తేదీ వరకు కొనసాగనుందట. ఆ తర్వాత మరో 10 రోజులు టాకీ పార్ట్‌తో పాటు, ముఖ్యంగా ప్రభాస్‌పై ఒక బ్యూటిఫుల్ మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ జరపనున్నారట.

## ఫాంటసీ-యాక్షన్ సినిమాలో నయనతార!



కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార, టాలెంటెడ్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వంలో ఓ కొత్త ఫాంటసీ యాక్షన్ చిత్రంలో నటించబోతున్నట్లు సమాచారం. దాదాపు ఎనిమిదేళ్ల గ్యాప్ తర్వాత ఈ క్రేజీ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 2018లో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇమైక్కా నొడిగల్' మూవీ బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఇక ఇప్పుడు అదే జోరుతో మరో పవర్‌ఫుల్ ఫాంటసీ కథతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా ట్రెండ్‌కు తగినట్లుగా యాక్షన్ ఎలిమెంట్స్ హైలైట్ అయ్యేలా ఈ సినిమాను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. విజువల్ పరంగానూ ఈ ప్రాజెక్ట్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని టాక్. ఈ భారీ చిత్రాన్ని 'పాషన్ స్టూడియోస్' బ్యానర్‌పై నిర్మించేందుకు సన్నాహాలు జరుగుతుండగా.. నయనతార సొంత బ్యానర్ 'రౌడీ పిక్చర్స్' కూడా ఇందులో భాగస్వామిగా చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.



## సెట్‌లో విజయ్ చాలా సీరియస్: రష్మిక

స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్న తొలి చిత్రం 'రణబాలి'. పీరియడ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ చిత్రంలో తన భర్త విజయ్‌తో కలిసి పనిచేసిన అనుభవం గురించి రష్మిక ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో ముచ్చటించిన రష్మిక, 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్‌లో భాగంగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. "'రణబాలి' సెట్‌లో విజయ్‌తో పనిచేయడం ఎలా అనిపించింది?" అని అభిమాని ప్రశ్నించగా.. రష్మిక స్పందించారు. "విజయ్‌తో పనిచేయడం ఎప్పుడూ సరదాగా ఉంటుంది. కానీ పని విషయానికి వస్తే, సెట్స్‌లో అతను చాలా సీరియస్‌గా, అంకితభావంతో ఉంటాడు. ఇది మీ అందరికీ తెలిసిన విషయమే. అతని నుంచి నేను కూడా ఎప్పటిలాగే చాలా విషయాలు నేర్చుకుంటాను" అని బదులిచ్చారు. మరోవైపు, ఈ సినిమా దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ కూడా ఇటీవల 'రణబాలి' గురించి ఓ ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఈ చిత్రంలో రష్మిక పోషిస్తున్న కథానాయిక పాత్రకు తన తల్లిగారైన 'జయమ్మ' పేరు పెట్టినట్లు ఆయన తెలిపారు. పాత కాలానికి చెందిన పాత్ర అయినప్పటికీ, నేటితరం మహిళలకు స్ఫూర్తినిచ్చేలా 'జయమ్మ' పాత్రను ఎంతో శ్రద్ధతో తీర్చిదిద్దినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే 'రణబాలి' సినిమా షూటింగ్ పూర్తయింది. 130 రోజుల పాటు నిర్విరామంగా సాగిన ఈ షూటింగ్ పూర్తయినట్లు దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమా విడుదల కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## జాన్వీ కపూర్‌పై నెపోటిజం కామెంట్లు!

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ ఎప్పుడూ తన గ్లామర్ ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తుంటారు. కానీ ఈసారి ఆమె అందాల ఆరబోత కాదు, ఒక వింతైన ఇంటర్వ్యూ వ్యాఖ్య నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. తనలో ఉన్న హిడెన్ టాలెంట్‌ను బయటపెట్టి ఆమె ఇప్పుడు నెటిజన్ల చేతికి చిక్కారు. అసలు ఆమె ఏం చెప్పారు? ఎందుకు ట్రోలింగ్ ఎదుర్కొంటున్నారు? ఆ విశేషాలు ఇలా వున్నాయి ..పారిస్ ఫ్యాషన్ వీక్‌లో అనుకోని మాట: ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ ఇటీవల పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే అక్కడ ఒక మీడియా సంస్థతో ముచ్చటిస్తున్న సమయంలో ఆమె చేసిన సరదా వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. ఇక తనలో ఉన్న ఒక వింతైన హిడెన్ టాలెంట్ గురించి మాట్లాడుతూ అందరినీ ఆశ్చర్యపరిచారు. సీరియస్‌గా మాట్లాడాల్సిన ఇంటర్వ్యూలో ఆమె ఈ ఫన్నీ విషయాన్ని బయటపెట్టడంతో క్షణాల్లో వార్త వైరల్ అయింది. ఇంటర్వ్యూలో భాగంగా జాన్వీ తనలో దాగి ఉన్న అరుదైన నైపుణ్యం గురించి చెప్పారు. తాను తన నాలుకను దాదాపు 360 డిగ్రీలు తిప్పగలనని తెలిపారు. అయితే దీన్ని ఆమె గొప్పగా చెప్పుకోలేదు; ఇదొక "చాలా చెత్త మరియు పనికిరాని స్కిల్" అని స్వయంగా నవ్వుతూ ఒప్పుకున్నారు. అయినా సరే, సెలబ్రిటీల నోటి నుంచి ఇలాంటి మాటలు వస్తే ఊరుకుంటారా? నెటిజన్లు వెంటనే దీనిని పట్టుకుని రకరకాల చర్చలకు తెరలేపారు.



## మేకర్స్ వల్లే అవకాశాలు రావట్లే



'కేజీఎఫ్' మూవీతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి, ప్రస్తుతం వెంకటేష్ హీరోగా వస్తున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తోంది. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీనిధి.. తాను తక్కువ సినిమాలు చేయడానికి అసలు కారణం ఏంటో క్లారిటీ ఇచ్చింది. గత కొన్నేళ్లుగా తాను చాలా తక్కువ ప్రాజెక్ట్స్ చేస్తుండటంతో అందరూ సెలక్టివ్‌గా ఉంటుందని అనుకుంటున్నారని, కానీ నిజానికి తనకు కెమెరా ముందు నటించడం అంటే చాలా ఇష్టమని శ్రీనిధి తెలిపింది. మంచి ఆఫర్లు వస్తే ఏడాదికి నాలుగు, ఐదు సినిమాలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని స్పష్టం చేసింది. అయితే తనకు తగినట్లుగా మంచి స్క్రిప్ట్, ఇంట్రెస్టింగ్ టీమ్ కుదిరితేనే ఆ ప్రాజెక్ట్‌లను ఓకే చేస్తానని చెప్పింది. కొన్నిసార్లు తన టైమింగ్ బాగోకపోవడం వల్ల కావచ్చు, లేదా మేకర్స్ తనను సరిగ్గా అంచనా వేయలేకపోవడం వల్ల కావచ్చు..అనుకున్నన్ని అవకాశాలు రాలేదని అభిప్రాయపడింది. తాను మంచి యాక్టర్ కాదేమో అని అందుకే అవకాశాలు ఇవ్వడం లేదనే భావన కలుగుతుందని చెప్పింది. తన గురించి తాను ఎప్పుడూ గొప్పగా ఊహించుకోనని, ఎప్పుడూ వాస్తవానికి దగ్గరగానే ఉంటానని తెలిపింది. కొత్త డైరెక్టర్ అయినా, పెద్ద డైరెక్టర్ అయినా తనకు అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతానని, కేవలం సినిమాపై ఉన్న ప్యాషన్‌తోనే తన పని తాను చేసుకుంటూ వెళ్తానని శ్రీనిధి చెప్పుకొచ్చింది.



# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మనోళ్ల హవా

## శ్రేయస్‌కు కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంక్

### టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు

**ఐసీసీ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు సత్తా చాటారు. టీమిండియా టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకోగా, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు.**

వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో అద్భుత శతకం సాధించిన శ్రేయస్ అయ్యర్, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 18 స్థానాలు ఎగబాకి 7వ స్థానంలో నిలిచాడు. నిన్న జరిగిన ఆ మ్యాచ్‌లో శ్రేయస్ కేవలం 43 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో అజేయంగా 102 పరుగులు చేసి జట్టుకు 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించాడు.



ఈ ప్రదర్శనతో అతను టీ20ల్లో భారత్ తరఫున మూడో అత్యుత్తమ ర్యాంకు బ్యాటర్‌గా నిలిచాడు. తాజా ర్యాంకింగ్స్‌లో ఇషాన్ కిషన్ (1), అభిషేక్ శర్మ (2) తొలి రెండు స్థానాల్లో ఉండగా.. తిలక్ వర్మ 10వ స్థానంలో ఉన్నాడు. దీంతో టీ20 బ్యాటింగ్ టాప్-10లో నలుగురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. మరోవైపు వన్డే ఫార్మాట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన అగ్రస్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నాడు. వెస్టిండీస్‌తో గువాహటిలో జరిగిన రెండో వన్డేలో అజేయంగా 223 పరుగులు చేసిన గిల్, తన కెరీర్‌లోనే అత్యధికంగా 841 రేటింగ్ పాయింట్లను అందుకున్నాడు. విజయవంతమైన వన్డే ఛేదనలో ఇదే అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. ఇదే జాబితాలో మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఒక స్థానం దిగజారి మూడో ర్యాంకుకు పడిపోయాడు. అదే సిరీస్‌లో అజేయ శతకం (129) బాదిన వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ తిరిగి టాప్-10లోకి ప్రవేశించాడు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్థాన్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ అబ్రార్ అహ్మద్‌ను వెనక్కి నెట్టి రషీద్ 8వ సారి నంబర్ 1 ర్యాంకును అందుకున్నాడు. టీ20 చరిత్రలో మరే బౌలర్ కన్నా ఎక్కువ కాలం



నం.01గా నిలిచిన బౌలర్‌గా రషీద్ రికార్డు సృష్టించాడు. భారత స్పిన్ ఆల్-రౌండర్ అక్షర్ పటేల్ గత మూడు మ్యాచ్‌ల్లో నిలకడగా రాణించి 16 స్థానాలు మెరుగుపరచుకుని 7వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఇతర ఆటగాళ్లలో వెస్టిండీస్ వన్డే కెప్టెన్ షాయ్ హోప్ (6వ ర్యాంక్), విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడెన్ సీల్స్ (10వ ర్యాంక్) వన్డేల్లో టాప్-10లోకి వచ్చారు. వెస్టిండీస్‌కే చెందిన అమీర్ జంగూ 55 స్థానాలు ఎగబాకి 55వ ర్యాంకు సాధించాడు. ఆసియా క్రీడల్లో రాణించిన పాకిస్థాన్ ఆటగాడు హసన్ నవాజ్ 62 స్థానాలు మెరుగుపరుచుకుని 48వ ర్యాంకులో నిలిచాడు.



## స్మృతి మంధానతో విభేదాల్లేవ్: హర్మన్‌ప్రీత్

భారత మహిళల క్రికెట్ జట్టు సురక్షితమైన చేతుల్లోనే ఉందని, కొత్త కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన స్మృతి మంధాన జట్టును విజయపథంలో ముందుకు నడిపిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని మాజీ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. దశాబ్దానికి పైగా జట్టును నడిపించిన తాను ఇప్పుడు కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నానని, స్మృతికి తన సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె స్పష్టం చేసింది.



సుదీర్ఘకాలంగా స్మృతితో తనకు ఉన్న అనుబంధం, అవగాహన జట్టుకు మరింత మేలు చేస్తుందని హర్మన్‌ప్రీత్ అభిప్రాయపడింది. అన్ని ఫార్మాట్ల కెప్టెన్సీ నుంచి తప్పుకుంటున్నట్లు హర్మన్‌ప్రీత్ ప్రకటించిన విషయం తెలిసిందే. 2012లో తొలిసారి పగ్గాలు చేపట్టిన ఆమె, తన నాయకత్వంలో జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించింది. ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన తర్వాత ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ నిర్ణయం వెనుక ఏదో ఒక టోర్నమెంట్ ఫలితం కారణం కాదని, చాలాకాలంగా ఆలోచించి తీసుకున్న వ్యక్తిగత నిర్ణయమని ఆమె స్పష్టం చేసింది. ఐఏఎన్ఎస్‌తో ప్రత్యేకంగా మాట్లాడుతూ హర్మన్‌ప్రీత్ తన మనసులోని మాటలను పంచుకుంది. "దశాబ్దానికి పైగా కెప్టెన్సీ బాధ్యతను గౌరవంగా భావించాను. జట్టు ప్రయోజనాలకే ఎప్పుడూ పెద్దపీట వేశాను. ఇప్పుడు నా ఆటను మరింత ఎక్కువగా ఆస్వాదించాలనుకుంటున్నాను. నా బ్యాటింగ్‌పై దృష్టి పెట్టడంతో పాటు, కుటుంబం, స్నేహితులతో గడిపేందుకు సమయం కేటాయించాలనే ఈ నిర్ణయం తీసుకున్నాను. అయితే, ఒక సీనియర్ ప్లేయర్‌గా, మెంటార్‌గా నా అనుభవంతో జట్టుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని వివరించింది.



## కోహ్లీకి ప్రేమానంద్ మహరాజ్ 5 కోట్లిచ్చారా?

### వార్తలను ఖండించిన విరాట్ కోహ్లీ ప్రతినిధి

భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ, భార్య అనుష్క శర్మ తరచూ వృందావన్‌లోని ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించడం తెలిసిందే. అయితే, ఈ సందర్శన వెనుక ఆర్థిక లావాదేవీలు ఉన్నాయంటూ వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఆశ్రమానికి వెళ్లేందుకు విరాట్ కోహ్లీకి ఒక ప్రైవేట్ సంస్థ రూ.5 కోట్లు చెల్లించిందన్న వాదనలను ఆయన ప్రతినిధి తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని స్పష్టం చేశారు. శ్రీకృష్ణ జన్మభూమి సంఘర్ష్ న్యాస్ అధ్యక్షుడు దినేశ్ శర్మ (ఫలహరి మహరాజ్) ఈ ఆరోపణలు చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. రాజస్థాన్‌కు చెందిన ఒక ప్రైవేట్ సంస్థ, విరాట్ కోహ్లీని ఆశ్రమానికి తీసుకువచ్చేందుకు రూ.5 కోట్లు ఖర్చు చేసిందని ఆరోపిస్తూ ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఒక లేఖ రాసినట్లు సమాచారం. ఈ వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలపై విరాట్ కోహ్లీ టీమ్ అధికారికంగా స్పందించింది. కోహ్లీ ఆశ్రమ సందర్శన వెనుక ఎలాంటి ఆర్థిక ప్రయోజనాలు లేవని తేల్చిచెప్పింది. "ప్రేమానంద్ మహరాజ్ పట్ల విరాట్ కోహ్లీకి ఉన్న ప్రగాఢమైన భక్తి, విశ్వాసం కారణంగానే ఆయన ఆశ్రమానికి వెళ్తున్నారు. ఈ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఇలాంటి సున్నితమైన విషయాల్లో వార్తలు ప్రచురించే ముందు మీడియా సంస్థలు వాస్తవాలను నిర్ధారించుకోవాలి" అని కోహ్లీ ప్రతినిధి ఒక ప్రకటనలో కోరారు. విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు తొలిసారిగా జనవరి 2023లో ప్రేమానంద్ మహరాజ్ ఆశ్రమాన్ని సందర్శించారు. అప్పటి నుంచి వారికి వీలు చిక్కినప్పుడల్లా ఆశ్రమానికి వెళ్లి మహరాజ్ ఆశీస్సులు తీసుకుంటున్నారు. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించిన విషయమని వారి సన్నిహితులు చెబుతున్నారు. కాగా, రూ.5 కోట్లు చెల్లించినట్లుగా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు, ఒప్పంద పత్రాలు గానీ బయటకు రాలేదు. దీంతో ఈ ఆరోపణలు కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోయాయి.

## భర్త రీఎంట్రీపై భువనేశ్వర్ అర్ధాంగి భావోద్వేగం



న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్ కోసం భారత జట్టును బీసీసీఐ నిన్న ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ జట్టు ఎంపిక అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఎవరూ ఊహించని విధంగా సీనియర్ పేసర్, స్వింగ్ కింగ్ భువనేశ్వర్ కుమార్ దాదాపు నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ భారత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ఒకప్పుడు మూడు ఫార్మాట్లలోనూ టీమిండియాకు ప్రధాన బౌలర్‌గా ఉన్న భువీ, గత కొంతకాలంగా సెలక్టర్ల దృష్టిలో లేకుండాపోయాడు. కానీ, ఐపీఎల్‌లో నిలకడగా రాణించడం అతడికి మళ్లీ జాతీయ జట్టు తలుపులు తెరిచింది. ఇలా భర్తకు చాలా కాలం తర్వాత మళ్లీ భారత జట్టులో చోటు దక్కడంతో భువనేశ్వర్ అర్ధాంగి నూపుర్ నాగర్ తన సంతోషాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. భారత జట్టును ప్రకటించిన స్క్రీన్‌షాట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ, చేతులు జోడించిన ఎమోజీతో పాటు 'గ్రాటిడావ్' (కృతజ్ఞత) అని క్యాప్షన్ జోడించారు. అంతటితో ఆగకుండా భువీ రీఎంట్రీపై మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ అభినందనలు తెలుపుతూ చేసిన వీడియోను కూడా ఆమె షేర్ చేశారు. ఇక, 36 ఏళ్ల భువనేశ్వర్ కుమార్ చివరగా 2022 నవంబర్‌లో ఆస్ట్రేలియాలోని అడిలైడ్ ఓవల్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్‌లో భారత్ తరఫున ఆడాడు. ఆ తర్వాత అతడిని సెలక్టర్లు పక్కనపెట్టారు. అయితే, పట్టు వదలకుండా దేశవాళీ క్రికెట్, ముఖ్యంగా ఐపీఎల్‌పై దృష్టి సారించాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున గత రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుతంగా రాణించాడు. ఈ రెండు సీజన్లలో కలిపి మొత్తం 45 వికెట్లు పడగొట్టి, జట్టు టైటిల్స్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ముఖ్యంగా కొత్త బంతితో వికెట్లు తీయడంలో, కీలక సమయాల్లో తన అనుభవాన్ని ఉపయోగించి పరుగులు కట్టడి చేయడంలో భువీ చూపిన ప్రతిభ, సెలక్షన్ కమిటీని మెప్పించింది. నిలకడైన ప్రదర్శన, అపారమైన అనుభవం కారణంగా భువనేశ్వర్‌కు ఈ అవకాశం లభించిందని, న్యూజిలాండ్ సిరీస్‌లో అతను ఎలా రాణిస్తాడో చూడాలని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## నా పని పరుగులు చేయడమే



టీమిండియాకు దూరమైన కాలం తనలోని లోపాలను తెలుసుకునేలా చేసిందని వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ చెప్పాడు. చేసిన కొన్ని తప్పుల పరిణామాలను అర్థం చేసుకుని.. ఫిట్‌నెస్, బ్యాటింగ్‌పై దృష్టి పెట్టానని తెలిపాడు. దేశవాళీ క్రికెట్‌లో ఓపికగా ఆడి తనను తాను నిరూపించుకున్నానని పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో లక్నో వేదికగా జరిగిన తొలి టీ20లో భారత్ విజయం సాధించిన తర్వాత ఇషాన్ తన పునరాగమనంపై మాట్లాడాడు. అంతర్జాతీయ జట్టుకు దూరమైన సమయంలో తన తప్పులను సరిదిద్దుకోవడంపైనే దృష్టి పెట్టినట్లు ఇషాన్ తెలిపాడు. ఫిట్‌నెస్‌ను మెరుగుపరుచుకోవడంతో పాటు బ్యాటింగ్‌పైనా వర్క్ చేశానని చెప్పాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా పరుగులు చేస్తే మళ్లీ జట్టులోకి వచ్చే అవకాశం తప్పకుండా వస్తుందని నమ్మానన్నాడు. "జట్టులో నుంచి తప్పించినప్పుడు నేను చేసిన కొన్ని తప్పుల పరిణామాలను అర్థం చేసుకున్నా. అందుకే ఫిట్‌నెస్, బ్యాటింగ్‌పై వర్క్ చేశా. ఓపికగా ఉండి దేశవాళీ క్రికెట్‌లో బాగా ఆడటంపై దృష్టి పెట్టా. అక్కడ నిలకడగా రాణిస్తే అవకాశం వస్తుందని తెలుసు. నా కష్టంతోనే మళ్లీ జాతీయ జట్టులోకి వచ్చా" అని ఇషాన్ చెప్పాడు.



## అప్పటికీ కోహ్లీ రిటైర్ కాడేమో

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ మాంటీ పనేసర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే వరల్డ్‌కప్ తనకు చివరిదని కోహ్లీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఆ టోర్నీ తర్వాత కూడా కోహ్లీ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పకపోవచ్చని పనేసర్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల వన్డేల్లో కోహ్లీ 15 వేల పరుగుల మైలురాయిని అందుకున్నాడు. ఈ సందర్భంగా కోహ్లీ ఆటపై పనేసర్ ప్రశంసలు కురిపించాడు. అతడిలో ఆటపై ఆకలి, దూకుడు, ఫిట్‌నెస్‌పై శ్రద్ధ తనను ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. కోహ్లీ శిక్షణ చూస్తే తాను కూడా జిమ్‌కు వెళ్లాలనిపిస్తుందని పేర్కొన్నాడు. "విరాట్‌లో ఇప్పటికీ పరుగులు చేయాలనే ఆకలి చాలా ఉంది. ప్రతి మ్యాచ్‌ను ఎంతో తీవ్రతతో ఆడతాడు. ఫిట్‌నెస్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తాడు. చుట్టూ ఉన్న వారిని కూడా ప్రోత్సహిస్తాడు. 10-15 మ్యాచ్‌లే మిగిలి ఉన్నాయని భావిస్తే ప్రతి మ్యాచ్‌ను ప్రత్యేకంగా చూస్తాం. కోహ్లీ కూడా ప్రస్తుతం అదే మైండ్‌సెట్‌తో ఆడుతున్నాడు. ప్రతి బంతికి తన వంద శాతం ఇస్తున్నాడు. అందుకే వరల్డ్‌కప్ తర్వాత అతడు రిటైర్ అవుతాడని నాకు అనిపించడం లేదు. అతడి నుంచి ఇంకా చాలా క్రికెట్ చూడొచ్చు" అని పనేసర్ చెప్పాడు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపైనా పనేసర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ గొప్ప ఆటగాడని, అతడికి ప్రపంచకప్ జట్టులో అవకాశం ఇవ్వాలని అన్నాడు. రోహిత్ క్రీజులో కుదురుకుంటే విధ్వంసకరంగా బ్యాటింగ్ చేయగలడని పేర్కొన్నాడు. "రోహిత్ అద్భుతమైన ఆటగాడు. అతడు ఫామ్‌లోకి వస్తే బ్యాటింగ్‌తో ప్రత్యర్థులను చిత్తు చేయగలడు. భారత్‌కు అతడి లాంటి నాణ్యమైన ఆటగాడు అవసరం" అని పనేసర్ చెప్పాడు.

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# ప్రజా పోరాటమా? రాజకీయ పోరాటమా?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ చర్యలను ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధానాలను ఎత్తిచూపడం, తప్పులను సరిదిద్దాలని డిమాండ్ చేయడం ప్రతిపక్ష బాధ్యత కూడా. అయితే ప్రతి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించడం, ప్రతి ప్రక్రియనూ తప్పుబట్టడం ప్రజా పోరాటంగా పరిగణించలేం. ప్రస్తుతం రాహుల్ గాంధీ చేపడుతున్న కొన్ని రాజకీయ కార్యక్రమాల విషయంలో ఇదే ప్రశ్న తలెత్తుతోంది. ఓటర్ల జాబితా సవరణ, పరిశీలన, శుద్ధీకరణ వంటి ప్రక్రియల్లో సమస్యలు ఉంటే వాటిని ప్రజల ముందుకు తీసుకురావాలి. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోయాయా? అనర్హుల పేర్లు చేరాయా? ఒకే వ్యక్తి పేరుతో బహుళ నమోదులు ఉన్నాయా? చిరునామాల మార్పుల్లో అవకతవకలు జరిగాయా? అధికార యంత్రాంగం నిబంధనలను సక్రమంగా పాటిస్తోందా? వంటి ప్రశ్నలు అడగాలి. ఆధారాలతో లోపాలను నిరూపించి, వాటిని సరిదిద్దాలని డిమాండ్ చేయాలి. కానీ ప్రక్రియలో ఉన్న లోపాలను ప్రస్తావించాల్సింది పోయి, మొత్తం ప్రక్రియే తప్పు అని చెప్పడం మాత్రం వేరే విషయం. ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత అవసరమే. ఓటరు హక్కు అత్యంత విలువైనదే. అదే సమయంలో ఓటర్ల జాబితాను నిరంతరం పరిశుభ్రంగా ఉంచడం కూడా ప్రజాస్వామ్యానికి అంతే అవసరం. సరైన ఓటరు జాబితా లేకుండా నిష్పక్షపాత ఎన్నికలు జరగడం సాధ్యం కాదు. అందుకే ప్రశ్న ప్రక్రియ ఉండాలా? వద్దా? అన్నది కాదు. లిలిప్రక్రియ ఎలా జరుగుతోంది? అందులో ఎక్కడ లోపాలున్నాయి? వాటిని ఎలా సరిచేయాలి? అన్నదే అసలు ప్రశ్న కావాలి. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీ ప్రజల సమస్యలను ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. కానీ ఒక రాజకీయ పార్టీకి ఎదురవుతున్న ఎన్నికల ప్రయోజనాలు, నష్టాలను ప్రజా సమస్యలతో కలిపివేయడం వల్ల పోరాటం విశ్వసనీయత కోల్పోయే ప్రమాదం ఉంది. ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న ఫలితం మారుతుందనే భయంతో ఒక వ్యవస్థను ప్రశ్నించడం, ప్రజల ఓటు హక్కు రక్షణ కోసం వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం.. ఈ రెండింటి మధ్య స్పష్టమైన తేడా ఉంది. ప్రజలు రాజకీయ పార్టీలను వారి మాటలతో మాత్రమే కాదు, వారి ఉద్దేశాల ద్వారా కూడా అంచనా వేస్తారు. ఒక అంశంపై అధికార పార్టీ తప్పు చేస్తే ప్రతిపక్షం ప్రశ్నించాలి. అదే అంశంలో ప్రతిపక్షానికి రాజకీయ ప్రయోజనం ఉన్నప్పటికీ, వాస్తవాలను వాస్తవాలుగానే చెప్పగలిగితేనే ఆ పోరాటానికి నైతిక బలం వస్తుంది. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘం వంటి సంస్థలపై విమర్శలు ఉండకూడదని చెప్పడం కూడా సరైంది కాదు. వాటి నిర్ణయాలు ప్రశ్నించరానివి కావు. కానీ విమర్శకు ఆధారాలు ఉండాలి.

ఆరోపణలకు నిర్ధారణ ఉండాలి. సమస్యను చూపించి పరిష్కారం కోరాలి. లేకపోతే ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల్లో అనవసర అనుమానాలు పెంచే పరిస్థితి ఏర్పడుతుంది. రాహుల్ గాంధీ వంటి జాతీయ స్థాయి నాయకుడి మాటలకు దేశవ్యాప్తంగా ప్రభావం ఉంటుంది. అందువల్ల ఆయన చేసే ప్రతి పోరాటం ఒక పార్టీ ప్రయోజనాన్ని మించి ప్రజాస్వామ్య ప్రయోజనాన్ని ప్రతిబింబించాల్సిన అవసరం ఉంది. ప్రజల ఓటు హక్కు విషయంలో పోరాటం చేస్తే, అది కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సంబంధించిన పోరాటంగా కనిపించకూడదు. రేపు అధికారంలో ఎవరు ఉన్నా, ఏ పార్టీకి నష్టం జరిగినా, ఏ పార్టీకి లాభం వచ్చినా ఒకే ప్రమాణంతో వ్యవస్థను ప్రశ్నించే స్థిరమైన వైఖరి కనిపించాలి.

ప్రజల కోసం పోరాటం అంటే ప్రజల పేరును ఉపయోగించడం కాదు. ప్రజల సమస్యను పార్టీ ప్రయోజనం నుంచి వేరు చేసి చూడగలగడం. అధికారంలో ఉన్నవారి తప్పులను మాత్రమే కాదు, తన పార్టీకి అనుకూలంగా లేని వాస్తవాలను కూడా అంగీకరించే ధైర్యం ఉండాలి. రాజకీయ పోరాటం అవసరమే. కానీ అది ప్రజా పోరాటంగా మారాలంటే పక్షపాత ముద్ర తొలగాలి. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేయాలని డిమాండ్ చేయాలి. అక్రమాలు జరిగితే ఆధారాలతో బయటపెట్టాలి. అధికారుల నిర్లక్ష్యం ఉంటే బాధ్యులపై చర్యలు కోరాలి. కానీ మొత్తం ప్రక్రియనే తప్పుబట్టడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీయకూడదు.

# బాల్యం 'బరువు'.. భవిష్యత్తు 'చక్కెర'

ఒకప్పుడు మధుమేహం అంటే మధ్యవయసు దాటిన తర్వాత వచ్చే వ్యాధిగా భావించేవారు. ఊబకాయం కూడా పెద్దల జీవనశైలికి సంబంధించిన సమస్యగానే కనిపించేది. కానీ ప్రపంచం మారిపోయింది. ఇప్పుడు చిన్నారుల ఆరోగ్యమే ఈ రెండు సమస్యలకు కేంద్రంగా మారుతోంది. పాఠశాలకు వెళ్లే వయసులోనే అధిక బరువు, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, రక్తపోటు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే.. టైప్-2 మధుమేహం కూడా పిల్లలు, కిశోరుల్లో పెరుగుతున్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తోంది. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది మన ఆహార వ్యవస్థపై, మన జీవనశైలిపై, పిల్లల పెంపకంపై, పాఠశాలల విధానాలపై, ప్రభుత్వ ప్రజారోగ్య విధానాలపై తీవ్రమైన ప్రశ్నలు సంధిస్తున్న సంక్షోభం. ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజా గణాంకాల ప్రకారం 2024లో 5 నుంచి 19 ఏళ్ల మధ్య వయసున్న 40 కోట్ల మంది పిల్లలు, కిశోరులు అధిక బరువుతో ఉన్నారు. వారిలో సుమారు 17 కోట్ల మంది ఊబకాయంతో ఉన్నారు.



డాక్టర్ ఎం మనోజ్ రెడ్డి
ముషీరాబాద్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్

1990లో ఇదే వయసు వర్గంలో అధిక బరువు సమస్య 8 శాతంగా ఉండగా, 2024 నాటికి 20 శాతానికి చేరింది. ఊబకాయం మాత్రం 2 శాతం నుంచి 8 శాతానికి పెరిగింది. అంటే మూడు దశాబ్దాల్లో పిల్లలు, కిశోరుల్లో ఊబకాయం నాలుగు రెట్లు పెరిగింది. ఇంకా చిన్న వయసులోనే సమస్య మొదలవుతోంది. 2024లో ఐదేళ్లలోపు 3.5 కోట్ల మంది పిల్లలు అధిక బరువుతో ఉన్నట్లు అంచనా. వీరిలో దాదాపు సగం మంది ఆసియాలోనే ఉన్నారు. ఇది కేవలం సంఖ్య కాదు. ప్రతి సంఖ్య వెనుక ఒక బాల్యం ఉంది. ఒక కుటుంబం ఉంది. ఒక భవిష్యత్తు ఉంది.

ఊబకాయం ఒక్కటే సమస్య కాదు. అది మరిన్ని దీర్ఘకాలిక వ్యాధులకు తలుపులు తెరుస్తుంది. అధిక బరువు, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం వంటి అంశాలు టైప్-2 మధుమేహానికి ముఖ్యమైన ప్రమాద కారకాలు. ఒకప్పుడు పెద్దలకు మాత్రమే కనిపించే టైప్-2 మధుమేహం ఇప్పుడు పిల్లల్లో కూడా ఎక్కువగా కనిపిస్తోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. పిల్లలకు వచ్చే ప్రతి మధుమేహం ఊబకాయం వల్లే కాదు. టైప్-1 మధుమేహం భిన్నమైన వ్యాధి. శరీరం ఇన్సులిన్‌ను తగినంతగా ఉత్పత్తి చేయకపోవడం వల్ల అది వస్తుంది. దాన్ని ప్రస్తుతం నివారించడానికి నిర్ధారిత మార్గం లేదు. మరోవైపు టైప్-2 మధుమేహం జీవనశైలి, అధిక బరువు, శారీరక శ్రమ లోపం వంటి అంశాలతో బలంగా సంబంధం కలిగి ఉంటుంది. కాబట్టి పిల్లల మధుమేహం గురించి మాట్లాడేటప్పుడు రెండింటినీ ఒకటిగా చూడటం సరికాదు. అయితే రెండింటికీ ఒక సామాన్యమైన అంశం ఉంది. చిన్న వయసులో వ్యాధి మొదలైతే, దానితో జీవించాల్సిన కాలం కూడా ఎక్కువ. అంటే బాల్యంలో మొదలైన ఆరోగ్య సమస్య.. యుక్తవయస్సులో, ఉద్యోగ జీవితంలో, కుటుంబ జీవితంలో కూడా వెంటాడే ప్రమాదం ఉంది.

ఇది పిల్లల తప్పా? ఇక్కడ మనం వేసుకోవాల్సిన అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇదే. ఒక చిన్నారి రోజూ ప్యాకెట్ ఆహారం తింటుంటే.. అది పూర్తిగా ఆ పిల్లవాడి తప్పేనా? పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలే కనిపిస్తుంటే.. అది పిల్లవాడి ఎంపికేనా? చేతిలో మొబైల్ పెట్టి గంటల తరబడి కూర్చోబెట్టిన తర్వాత.. శారీరక శ్రమ ఎందుకు లేదని అదే పిల్లవాడిని దించగలమా? టెలివిజన్, సామాజిక మాధ్యమాలు, వీడియోల మధ్యలో తీపి పానీయాలు, చిరుతిళ్లు, వేగవంతమైన ఆహారాల ప్రకటనలు నిరంతరం కనిపిస్తుంటే.. వాటి ప్రభావాన్ని పూర్తిగా పిల్లవాడిపైనే మోపగలమా? సమాధానం స్పష్టమే. ఇది వ్యక్తిగత ఎంపిక మాత్రమే కాదు. ఇది మన చుట్టూ నిర్మించబడిన ఆహార వాతావరణం సమస్య. యునిసెఫ్ 2025 బాలల పోషకాహార నివేదిక ప్రకారం 5-19 ఏళ్ల పిల్లలు, కిశోరుల్లో అధిక బరువు సమస్య 2000లో 19.4 కోట్ల నుంచి 2025లో 39.1 కోట్లకు పెరిగింది. 2025లో తొలిసారిగా ఈ వయసు వర్గంలో ఊబకాయం శాతం తక్కువ బరువు శాతాన్ని మించింది. ఇది ప్రపంచ పోషకాహార చరిత్రలో ఒక కీలక మలుపు.

మానవ సమాజం ఒకప్పుడు పిల్లలకు తగినంత ఆహారం దొరకకపోవడం అనే సమస్యతో పోరాడింది. ఇప్పటికీ ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో పోషకాహార లోపం, ఎదుగుదల లోపం, తక్కువ బరువు సమస్యలు ఉన్నాయి. కానీ అదే సమయంలో మరో విరుద్ధ దృశ్యం ఏర్పడింది. ఆహారం అందుబాటులో ఉంది. కానీ ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో ఉందా? దుకాణాల్లో పండ్లు, కూరగాయలు, సంప్రదాయ ధాన్యాల కంటే ప్యాకెట్ చిరుతిళ్లు, తీపి పానీయాలు, అధిక ఉప్పు-చక్కెర-కొవ్వు కలిగిన ఆహారాలు సులభంగా దొరుకుతున్నాయి. ధర, అందుబాటు, రుచి,



ఆకర్షణీయమైన ప్యాకేజింగ్.. అన్నీ వాటి వైపే పిల్లలను లాగుతున్నాయి. యునిసెఫ్ నివేదిక ఇదే విషయాన్ని హెచ్చరిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పిల్లలు, కిశోరులు అధికంగా శుద్ధి చేసిన ఆహారాలు, తీపి పానీయాలకు గురవుతున్నారని, అనారోగ్యకరమైన ఆహార వాతావరణం వారి ఎంపికలను ప్రభావితం చేస్తోందని పేర్కొంది.

ప్రకటనలతో పిల్లల మనసులపై దాడి జరుగుతోంది. ఇది కేవలం దుకాణంలో మొదలయ్యే సమస్య కాదు. పిల్లవాడు మొబైల్ తెరిచినప్పుడు అక్కడ కూడా అదే ఆహారం. వీడియో చూస్తే మధ్యలో అదే ప్రకటన. క్రీడా కార్యక్రమం చూస్తే అదే బ్రాండ్. పాఠశాల సమీపంలోని దుకాణంలో అదే రంగురంగుల ప్యాకెట్లు. ఇది యాదృచ్ఛికం కాదు. పిల్లల అభిరుచులను ప్రభావితం చేసేలా ఆహార ప్రకటనలు రూపొందుతున్నాయి. యునిసెఫ్ 2025 నివేదిక ప్రకారం 13-24 ఏళ్ల యువతలో నిర్వహించిన ప్రపంచవ్యాప్త సర్వేలో 75 శాతం మంది గత వారం తీపి పానీయాలు, వేగవంతమైన ఆహారం లేదా చిరుతిళ్ల ప్రకటనలు చూసినట్లు తెలిపారు. పిల్లల మనసులు ఇంకా అభిరుచులను నిర్మించుకునే దశలో ఉంటాయి. అలాంటి దశలో ఒక ఉత్పత్తిని పదేపదే చూపిస్తే దాని ప్రభావం సహజంగానే ఉంటుంది. అందుకే ఇది కేవలం మార్కెట్ స్వేచ్ఛ ప్రశ్న కాదు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత కూడా. తల్లిదండ్రులు కూడా మారాలి. అయితే మొత్తం బాధ్యతను ప్రభుత్వాలపై, ఆహార పరిశ్రమపై నెట్టేసి తల్లిదండ్రులు తప్పించుకోలేరు. పిల్లల ఆహార అలవాట్లు ఇంట్లోనే ప్రారంభమవుతాయి. ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు పంపడం.. ఇంట్లో తయారు చేసిన ఆహారానికి బదులుగా ప్రతిరోజూ ప్యాకెట్ చిరుతిళ్లు ఇవ్వడం.. నీటికి బదులుగా తీపి పానీయాలు అలవాటు చేయడం.. పిల్ల ఏడిస్తే వెంటనే మొబైల్ ఇవ్వడం.. పిల్ల బయట ఆడుకోవడం కంటే ఫోన్‌లో ఉండటాన్ని సౌకర్యంగా భావించడం.. ఇవన్నీ చిన్న విషయాల్లా కనిపించినా, సంవత్సరాల తర్వాత ఆరోగ్యంపై పెద్ద ప్రభావాన్ని చూపవచ్చు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలి గురించి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే పెద్దలు ఆచరించడం ముఖ్యం. తల్లిదండ్రులు స్వయంగా రోజంతా కూర్చుంటూ పిల్లలను వ్యాయామం చేయమని చెప్పడం పనిచేయదు.

పిల్లల జీవితంలో ఎక్కువ సమయం గడిచేది పాఠశాలలోనే. అయితే మన విద్యా వ్యవస్థలో శారీరక విద్యకు ఎంత ప్రాధాన్యం ఉంది? పరీక్షల ఒత్తిడి.. అదనపు తరగతులు.. కోచింగ్.. హోంవర్క్.. పోటీ పరీక్షల సిద్ధత.. ఇవన్నీ పెరుగుతున్న కొద్దీ పిల్లల ఆట సమయం తగ్గుతోంది. ఒకప్పుడు పాఠశాల మైదానం పిల్లల రెండో ఇల్లు. ఇప్పుడు చాలా చోట్ల మైదానాలే తగ్గిపోతున్నాయి. ఉన్న మైదానాలను కూడా ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. పిల్లలకు ప్రతిరోజూ శారీరక కదలికకు తగిన సమయం ఇవ్వడం విద్యా వ్యవస్థలో భాగం కావాలి. ఆరోగ్యకరమైన శరీరం లేకుండా ఆరోగ్యకరమైన విద్యా ఫలితాలు కూడా సాధ్యం కావు.

ప్రపంచవ్యాప్తంగా సమస్య పెరుగుతున్నప్పటికీ, భారతదేశం వంటి దేశాలకు ఇది మరింత సంక్లిష్టమైన సవాలు. ఒకవైపు ఇంకా పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు ఉన్నారు. మరోవైపు పట్టణ, మధ్యతరగతి కుటుంబాల్లో అధిక బరువు, ఊబకాయం పెరుగుతున్నాయి. అంటే మన ముందున్నది రెండు అంచుల పోషకాహార సంక్షోభం. ఒక పిల్లవాడికి సరైన ఆహారం దొరకడం లేదు. మరో పిల్లవాడికి సరైన ఆహారం బదులుగా అధిక కేలరీలు, అధిక చక్కెర, అధిక ఉప్పు, అధిక కొవ్వు కలిగిన ఆహారం ఎక్కువగా అందుతోంది. ఇద్దరికీ సమస్య ఒక్కటే కాదు. పరిష్కారం కూడా ఒక్కటే కాదు. కానీ రెండింటికీ ఒకే పునాది అవసరం- పోషకాహారం అందరికీ అందుబాటులో ఉండాలి.

పేదరికం కూడా ఊబకాయానికి కారణమవుతుందా? సాధారణంగా ఊబకాయం అంటే డబ్బున్న కుటుంబాల సమస్యగా భావిస్తారు. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ తాజా విశ్లేషణలు ఈ అభిప్రాయాన్ని మార్చుతున్నాయి. అనారోగ్యకరమైన ఆహారం తరచూ చౌకగా, సులభంగా, వెంటనే అందుబాటులో ఉంటుంది. ఆరోగ్యకరమైన ఆహారం కొన్నిసార్లు ఖరీదైనదిగా లేదా అందుబాటులో తక్కువగా ఉండవచ్చు. అందుకే ఊబకాయం కేవలం వ్యక్తిగత నియంత్రణ లోపం కాదు. ఆర్థిక, సామాజిక, పర్యావరణ పరిస్థితులతోనూ సంబంధం ఉన్న ప్రజారోగ్య సమస్య. పిల్లలకు ప్రతి చిరుతిండినీ నిషేధించడం పరిష్కారం కాదు. వారిని భయపెట్టడం కూడా కాదు. ఊబకాయంతో ఉన్న పిల్లలను అవమానించడం మరింత ప్రమాదకరం. అది వారి మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. పాఠశాలలో ఎగతాళి, వివక్ష, సామాజిక ఒత్తిడి వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా బాల్య ఊబకాయం శారీరక సమస్యతో పాటు మానసిక, సామాజిక ప్రభావాలను కలిగిస్తుందని పేర్కొంటోంది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.